teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 230 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 21 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం

**తేనీటి విందుకు గవర్నర్, సీఎం మరియు ముఖ్యులు**

హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ కు వచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఈ తేనీటి విందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు.






## అసెంబ్లీలో భూభారతి బిల్లుకు ఆమోదం

**బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు-2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు

మిగతా 2 లో



## రాష్ట్రంలో ఏర్పాటు కానున్న రెండు కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు

**ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి**

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రెండు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. మహబూబ్ నగర్, మంచిర్యాలను కార్పొరేషన్లుగా

మిగతా 2 లో

# మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

**ప్రస్తుతం 3 కోచ్‌లతో నడుస్తోన్న హైదరాబాద్ మెట్రో రైల్**

**6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్న ప్రభుత్వం**

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన**

**ఎల్ అండ్ టీతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడి**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మెట్రో రైలు కొద్దికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. ప్రయాణికులకు మెరుగైన రవాణా అందిస్తూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. నిత్యం 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది హైదరాబాద్ మెట్రో. ఏడేళ్ల

మిగతా 2 లో






## సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

**ఫార్ములా ఈ రేసుల కేసులో గోబెల్స్ ప్రచారమంటూ ఆరోపణలు**

హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఫార్ములా ఈ రేసుల కేసు వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తొలి అడుగులోనే కేటీఆర్ విజయం సాధించారు. హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నాం.రేవంత్

మిగతా 2 లో



## భూభారతి బిల్లుపై చర్చను అడ్డుకునే కుట్ర

**మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం**

**పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపనలు**

హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఇటీవల పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను, నేడు అసెంబ్లీలో దలిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. లక్షలాది మంది

మిగతా 2 లో

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో రెండు మున్సిపాలిటీలు

**11కు చేరుకోనున్న పురపాలకల సంఖ్య**

**నర్సంపేట మున్సిపాలిటీలో గ్రామాల విలీనంతో పరిధి పెంపు**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రకటన**




ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో మరో అడుగు. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌లను మునిసిపాలిటీలుగా చేయనున్నట్లుగా శుక్రవారం మునిసిపల్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రకటించారు.

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): అలాగే వరంగల్ జిల్లాలోని నర్సంపేట మునిసిపాలిటీలో మరో ఆరు గ్రామాలను విలీనం చేస్తూ పరిధిని విస్తృతం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎన్నోఏళ్లుగా మునిసిపాలిటీ హోదా కోసం

మిగతా 2 లో



## ఫార్ములా ఈ రేస్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**సీఎంని తప్పుదోవ పట్టిస్తున్నారా, సీఎంయే తప్పుదోవ పట్టిస్తున్నారా**

**అర్థం కావడం లేదని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఫార్ములా ఈ రేస్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ రేస్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేక ముఖ్యమంత్రి నే అందరిని తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. నిన్నటి మీడియా

మిగతా 2 లో




## టిజిబీగా మారనున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు

**493 శాఖలు టీజీబీలో విలీనం కానున్నట్లు సమాచారం**

**ఈ నెల 28 నుండి పలు సేవలు బంద్, జనవరి 1న పునరుద్దరణ**

**బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి వెల్లడి**

వరంగల్ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి వరంగల్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించి కీలక విషయాన్ని వెల్లడించారు. ఇప్పటివరకూ తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులుగా ఉన్నవి కాస్తా 2025 జనవరి నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా మారనున్నట్లు ఆయన తెలిపారు. "వన్ స్టేట్-.. వన్ ఆర్ఆర్‌బీ" (One State One Regional Rural Banks Policy) సంకల్పంతో

మిగతా 2 లో

## కాంగ్రెస్ పార్టీ ఎంపీల కన్వీనర్గా మల్లు రవి



హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీల కన్వీనర్‌గా మల్లు రవి నియామకం అయ్యారు. పార్లమెంట్‌లో

మిగతా 2 లో



## హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

**పది రోజుల పాటు అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు**

హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు ఊరట లభించింది. పది రోజుల పాటు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 30వ తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి

మిగతా 2 లో

## సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

**ఈ నెల 21న ప్రారంభంకానున్న పరీక్షకు అప్లికేషన్ ప్రక్రియ**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన, బీసీ, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ పరీక్షకు

మిగతా 2 లో



## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వజ్రోత్సవాలు

**ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్**

.. వివరాలు 2లో

# మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం





మొదటి పేజీ తరువాయి
ార్తి చేసుకున్న హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను క్రియేట్ చేసింది. ఏడేళ్ల క్రితం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలులో ఇప్పటివరకు 63 కోట్ల మందికి పైగా ప్రయాణం చేశారు. సగటున ప్రతిరోజు 4.75 లక్షల మంది మెట్రో ప్రయాణం చేస్తుండగా.. గరిష్టంగా 5.63 లక్షల మంది ప్రయాణికులుగా జర్నీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మెట్రో ప్రాజెక్టుల్లో ఢిల్లీ మెట్రో ప్రథమ స్థానంలో ఉంటే.. హైదరాబాద్ మెట్రో మూడోస్థానంలో కొనసాగుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంలో మెట్రో రైళ్లు బ్యాక్ బోన్‌గా ఉంటున్నాయి. ప్రారంభంలో మెట్రో ప్రయాణాలపై అంతగా ఆసక్తి చూపని నగరవాసులు.. ఆ తర్వాత మెల్ల మెల్లగా మెట్రో ప్రయాణం వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలో సేవలందిస్తోంది హైదరాబాద్ మెట్రో. ప్రస్తుతం మూడు కారిడార్లలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ, వేగంగా ప్రయాణించేందుకు ఎక్కువ శాతం మెట్రోను ఆశ్రయిస్తున్నారు. వీరితోడు ఉద్యోగులు, విద్యార్థులు సైతం ప్రయాణాలకు ఇష్టపడుతున్నారు. దీంతో మెట్రో రైలులో సైతం విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. బిజినెస్ వేళల్లో కనీసం కాలు నిలపలేని పరిస్థితి. ప్రస్తుతం ట్రైన్లలో కూర్చుని ప్రయాణాలు చేసేందుకు ఏమాత్రం అవకాశం దొరకడం లేదు. ఈ క్రమంలోనే మెట్రో కంపార్ట్‌మెంట్ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మెట్రో ప్రయాణికుల రద్దీపై రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైల్ 3 కోచ్‌లతో నడుస్తోంది. కావున రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెట్రోను 3 కోచ్‌లతో నడిపేందుకు డిజైన్ చేసినట్లు తెలిపిన మంత్రి.. దాన్ని 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆరు కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ యాజమన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కోచ్‌ల పెరిగితే, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని, కూర్చొని ప్రయాణించే వీలు కలుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇక మెట్రో సెకండ్ ఫేజ్‌కు కూడా రేవంత్ సర్కార్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే! రెండో దశలో చేపట్టబోయే పనులపై డీపీఆర్ రెడీ అయింది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన మెట్రో మార్గం.. పలు ప్రత్యేకతల సమాహారంగా ఉండబోతోంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అండర్ గ్రౌండ్ మార్గం నిర్మించేలా ప్రణాళిక రెడీ చేశారు. నాగోల్-ఎయిర్‌పోర్ట్, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్ %-% పటాన్‌చెరు వరకు అవకాశం ఉన్న చోట డబుల్ డెక్కర్ నిర్మిస్తారు. రెండో దశలో ప్రతి కిలో మీటరుకు రూ.318 కోట్లు ఖర్చు అవుతుంది.

## ఫార్ములా ఈ రేస్ పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి
సమావేశం అవినీతి జరుగలేదు అని పొన్నం ప్రభాకర్ చెప్పారన్నారు. ప్రోజీసర్ కరెక్ట్ గా లేదు అంతేకాని అవినీతి లేదని అన్నారు. నేను చెప్పాల్సిన విషయాలు అన్ని చెప్పడం జరిగిందని కేటీఆర్ అన్నారు. నేనేం భయపడటం లేదన్నారు. అయిన మేము అలానే ముందుకు పోతామంటే మేము కూడా లీగల్ గా ముందుకు వెళతామని కేటీఆర్ అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు గురించి చెప్పాలన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రిసోర్స్ మోబిలైజేషన్ అని ఉండేది. దానికి హరీష్ రావు చైర్మన్ ఉండేదన్నారు. ఓఆర్ఆర్ పై టీఓటీ విధానంపై మేము రూ.7400 కోట్లు తెచ్చి రైతు రుణమాఫీ ఇవ్వడం జరిగింది. బీఆర్ఎస్ టీఓటీని పారదర్శకంగా చేయడం జరిగిందన్నారు. ఆనాడు ఇదే ముఖ్యమంత్రి ఎంపీగా ఉండి లక్షల కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు. దానికి హెచ్ఎండీఏ రేవంత్ రెడ్డి పై పరువునష్టం దావా వేశారని కేటీఆర్ గుర్తుచేశారు. అంతేకాదు ఇప్పుడు పదే పదే కుంభకోణం జరిగిందని అన్నారు కదా మరి ఆ పర్మిషన్ రద్దు చేయలేదన్నారు. ఓఆర్ఆర్ పై సిట్టింగ్ జడ్జ్ విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. సిట్ అంటేనే ఆయన కోసం పని చేసే అధికారులు ఉంటారని తెలిపారు. ప్రమోషన్ కోసం పని చేయాల్సిన వారు ఉన్నారన్నారు. నేషనల్ హైవే వాళ్ళు పెట్టిన టిఓటి ప్రకారమే వెళ్లాం తప్ప ఇంకోటి లేదన్నారు.

## టిజిబీగా మారనున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు

మొదటి పేజీ తరువాయి
ముందుకెళుతున్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వుల మేరకు ఏపీజీవీబీకు సంబంధించిన 493 శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో 2025, జనవరిలో విలీనం కానున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్‌లోని టీజీబీ హెడ్ ఆఫీస్ కింద ఏపీజీవీబీ బ్రాంచ్‌లు కార్యకలాపాలు నిర్వహించనున్నాయని చెప్పారు. సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం బ్యాంక్ ఆపరేషన్స్, ఆన్ లైన్ బ్యాంకింగ్ సర్వీస్‌లు (ఖూ×,ాూవీ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొదలైనవి) డిసెంబర్ 28 నుంచి తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఆయన వెల్లడించారు. జనవరి 1వ తేదీ నుంచి తిరిగి అన్ని సర్వీసులు పునరుద్ధరించబడతాయని, డిసెంబర్ 27వ తేదీలోగా తమ లావాదేవీలను పూర్తి చేసుకుని ఖాతాదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఖాతాదారుల ఖాతా నంబర్లు అలాగే ఉంటాయి కాబట్టి గ్రామీణ బ్యాంక్ అకౌంట్ హోల్డర్స్ ఎవరూ ఆందోళన చెందవద్దని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఖాతాదారులకు తెలిపారు.

## హైకోర్టులో కేటీఆర్ కు ఊరట



మొదటి పేజీ తరువాయి
సూచించింది. తదుపరి విచారణ కొనసాగుతుందని, విచారణకు కేటీఆర్ సహకరించాలని ఆదేశాల్లో పేర్కొంది. తనపై పెట్టిన FIRను కొట్టేయాలన్న కేటీఆర్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్ దాదాపు 2 గంటల పాటు సాగిన వాదనలు కొనసాగాయి. తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా వేసింది.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో రెండు మున్సిపాలిటీలు

మొదటి పేజీ తరువాయి
ఎదురు చూస్తున్న కేసముద్రం, స్టేషన్‌ఘన్‌పూర్‌వాసుల కల నెరవేరినట్లయింది. కేసముద్రం, స్టేషన్‌ఘన్‌పూర్‌లు ప్రస్తుతం నగర పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. మునిసిపాలిటీల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఇంకా విధివిధానాలు, కూర్పుపై పూర్తి స్పష్టత ఇవ్వలేదు. గతంలో చేసిన ప్రతిపానదల ప్రకారం.. కేసముద్రం టౌన్, కేసముద్రం విలేజ్, అమీనాపురం, ధనసరి, సబ్ స్టేషన్ తండా గ్రామాలను కలుపుతూ కేసముద్రం మున్సిపాలిటీని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అలాగే ఛాగల్లు, స్టేషన్ ఘన్పూర్, శివునిపల్లి గ్రామాలను కలుపుతూ స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీ ఆవిర్భవించనుంది. ఇక నర్సంపేట మునిసిపాలిటీలో మరో తొమ్మిది గ్రామాలను విలీనం చేసే ప్రతిపాదనలు కొనసాగుతున్నాయి. అందులో మాదన్నపేట (జనాభా 1586), నాగుర్లపల్లి(1251), మహేశ్వరం(3669), ముగ్దుమ్ పురం (2346), రాజపల్లె(1401), రాములు తండా( 655), పర్శనాయక్ తండా(517), మ-త్తోజిపేట(1928), నర్సంపేట మండలంలో ఏకైక ఏజెన్సీ గ్రామమైన రాజుపేట(1403) ఉండనున్నాయి.




**11కు చేరుకోనున్న పురపాలకల సంఖ్య**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే హనుమకొండ జిల్లాలో పరకాల, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, జనగామ జిల్లాలో జనగామ మున్సిపాలిటీలున్నాయి. తాజాగా స్టేషన్‌ఘన్‌పూర్, కేసముద్రంలు చేరుతుండటంతో మునిసిపాలిటీల సంఖ్య మొత్తం 11కు చేరనుంది. కొన్ని చిక్కుముడులు దాటితే ములుగు జిల్లా కేంద్ర పంచాయతీకి అప్‌గ్రేడ్ దక్కనుంది.

## సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్



మొదటి పేజీ తరువాయి
సంబంధించి అప్లికేషన్ ప్రక్రియ డిసెంబర్ 21న ప్రారభం కానుంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://tgcet.cgg.gov.in ద్వారా ఫిబ్రవరి 01, 2025 వరకు ఆన్‌లైన్ విధానంలో అప్లై చేసుకోవచ్చు. విద్యార్థులు రూ. 100 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఫోన్ నెంబర్ సాయంతో ఒక దరఖాస్తు మాత్రమే చేయవచ్చు.

**విద్యార్హత:**
2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అప్లై చేసుకోవచ్చు.

**ఎంపిక విధానం:**
ప్రవేశ పరీక్ష, స్థానికత, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

**వయస్సు:**
ఓసీ, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఆదాయ పరిమితి**
విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూరల్ ప్రాంతం అయితే రూ.1.50,000.. అదే అర్బన్ ప్రాంతం అయితే రూ.2,00,000 మించకూడదు.

**ప్రవేశ పరీక్ష తేదీ:**
ఫిబ్రవరి 23వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎంపీల కన్వీనర్గా మల్లు రవి

మొదటి పేజీ తరువాయి
కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆయా రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలకు కన్వీనర్లను నియమించింది. ఈ మేరకు జాబితా విడుదల చేసింది. ఇందులో తెలంగాణ నుంచి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్ గా నాగర్ కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి పేరును ఖరారు చేసింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నేతగా ఉన్న మల్లు రవికి ఈ అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సహచర ఎంపీ మల్లు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విషయాన్ని ఎంపీ చామల ట్విట్టర్ వేదికగా తెలియజేశారు.



## అసెంబ్లీలో భూభారతి బిల్లుకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి
పొంగులేటి. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని డిసెంబర్ 21 శనివారానికి వాయిదా వేశారు స్పీకర్. అంతకు మందు భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ సర్కార్ ను తూర్పారబట్టారు. ధరణి పోర్టల్ కేసీఆర్ తీసుకొచ్చింది కాదని 2010లో ఒడిశాలో ఈ ధరణి తీసుకొచ్చారని అన్నారు. ధరణిలో లోపాలున్నాయని కాగ్ తేల్చిందన్నారు. అర్హత లేని కంపెనీకి ధరణిని అప్పగించారని 2014లోనే కాగ్ తప్పుబట్టిందన్నారు. కాగ్ తప్పుబట్టిన ధరణిని కేసీఆర్ తెలంగాణలో ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ధరణి చట్టాన్ని రిప్లేస్ చేస్తూ కొత్త చట్టం తెస్తున్నామన్నారు సీఎం రేవంత్. కొత్త చట్టం ద్వారా కోటి 52 లక్షల ఎకరాల భూముల వివరాలను భద్రపరుస్తామని చెప్పారు. ప్రతి భూ యజమాని హక్కులను కాపాడుతామన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రూల్స్ ఉల్లంఘించిందన్నారు. చర్చను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్ర చేసిందన్నారు.

## రాష్ట్రంలో ఏర్పాటు కానున్న రెండు కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు

మొదటి పేజీ తరువాయి
ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. అలాగే కరీంనగర్ కార్పొరేషన్ పరిధిని పెంచుతూ, అందులో కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేస్తున్నట్టు చెప్పింది. ఈ మేరకు అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు గురువారం ప్రకటించారు. తెలంగాణ మున్సిపాలిటీస్ సవరణ బిల్లు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణ బిల్లులపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా 12 కొత్త మున్సిపాలిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కోహీర్, గుమ్మడిదల, గడ్డ పోతారం, ఇస్నాపూర్, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మొయినాబాద్, కొడంగల్ నియోజకవర్గంలో మద్దూర్, మహబూబ్ నగర్ జిల్లాలో దేవరకద్ర, వరంగల్ జిల్లాలో కేసముద్రం, స్టేషన్ ఘన్ పూర్, కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, ఖమ్మం జిల్లాలో ఏదులాపురంను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.


## సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి
అక్రమంగా బనాయించిన కేసులో అరెస్టు చేయవద్దని హైకోర్టు చెప్పింది. ఇది డొల్ల కేసు అని హైకోర్టు చెప్పింది. ఈ కార్ రేసుల వల్ల తెలంగాణకు లాభం జరిగింది. రూ.600 కోట్ల నష్టం కాదు రూ.600 కోట్ల లాభం జరిగింది. అవినీతి జరగలేదని స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అవినీతి జరగలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినప్పుడు ఇక ఏసీబీ కేసు ఎందుకు. హామీలపై ప్రజల దృష్టిని మరల్చి జిమ్మిక్కులు చేస్తున్నారు'అని హరీశ్‌రావు మండిపడ్డారు. కాగా, ఫార్ములా ఈ కార్ రేసుల కేసులో ఏసీబీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏ1 చేర్చి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

## భూభారతి బిల్లుపై చర్చను అడ్డుకునే కుట్ర

మొదటి పేజీ తరువాయి
రైతుల ప్రయోజనం చేకూర్చే భూభారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల భూకబ్జాల బాగోతం బయటపడుతుందని సభను పక్క దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ రేస్ కు కేటీఆర్ డబ్బులు చెల్లించారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు? అని నిలదీశారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని తేల్చిచెప్పారు. మరోవైపు బీఏసీలో ఈ ఫార్ములా ఈ రేస్ మీద చర్చ కోసం బీఆర్ఎస్ ఎందుకు అడగలేదు? అని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని బీఆర్ఎస్ రాజకీయం చేస్తుందన్నారు. జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు అంటూ విమర్శించారు. తప్పు లేకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటకు రావచ్చు కదా? అని అన్నారు. కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్య గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళితే తప్పు పట్టిన కేటీఆర్ ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నిజాయితీ లేదని, అందరూ చట్టం ముందు సమానులే ఫార్ములా ఈ కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వజ్రోత్సవాలు



హైదరాబాద్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్ లో రెండు రోజుల పాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని పిజేటీఏయూ క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనలను ప్రారంభించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వజ్రోత్సవాల మినియేచర్ పైలాన్ ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిజేటీఏయూ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య తో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ అభివృద్ధికి అసమాన సేవల్ని అందించిందన్నారు. సోనామసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భవిష్యత్ ప్రణాళికల అమలులో విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని గవర్నర్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ విద్యని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఫీజులు తగ్గించడం స్వాగతించదగినదన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదం ఇచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీద ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం వాతావరణ మార్పులు వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొని మంచి భవిష్యత్తు దిశగా అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నమెంట్ పిలుపునిచ్చారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## కరిగిపోతున్న అంబానీ, ఆదానీల ఆదాయం

భారత కుబేరుల సంపద సన్నగిల్లుతోంది. అంబానీ, అదానీల నికర సంపదలో డౌన్‌ఫాల్ మొదలయ్యింది. కొంతకాలంగా భారత స్టాక్ మార్కెట్ సూచీలు పతనం అవుతుండగా? దిగ్గజ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ స్టాక్స్ పెద్ద మొత్తంలో పడిపోతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తల నికర సంపద భారీగా తగ్గుతోంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలవడమే గాక, ఆసియాలోనే ధనికులుగా గుర్తింపు పొందినవారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ. కొద్ది నెలల క్రితం నికర ఆదాయం భారీగా పెరిగిన వీరు, ఇప్పుడు మాత్రం బ్లూమ్ బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్ లో చోటు దక్కించుకోలేకపోయారు. వారి వ్యాపారాలతోపాటు వ్యక్తిగత సంపద విషయంలోనూ ఇద్దరూ సవాళ్లు ఎదుర్కోవడం వల్లే ఈ క్లబ్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని తాజాగా విడుదలైన 'బ్లూమ్‌బర్గ్' నివేదిక పేర్కొంది. అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇప్పుడు, ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10లో ఇద్దరిలో ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సెప్టెంబరు 2022లో గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉండగా.. ఇప్పుడు 19వ స్థానానికి పడిపోయారు. ముఖేష్ అంబానీ 17వ స్థానానికి పరిమితమయ్యారు. తాజాగా.. ఇద్దరి సంపద 100 బిలియన్ డాలర్ల మార్క్ దిగువకు చేరినట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది. జులైలో, తన కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీలో ఇది రూ. 10.25 లక్షల కోట్లు. అదే సమయంలో అంబానీ కుమారుడు వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, కేసులతో కొత్త చిక్కులు ఎదుర్కొంటున్నఅదానీ కూడా డౌన్‌ఫాల్‌ను ఎదుర్కుంటున్నారు. సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందడం కోసం భారతీయ అధికారులకు ముడుపులు ఇచ్చిన వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. అమెరికాలో ఆరోపణలు, కేసులు.. అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా అదాని సంపద 100 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద 96.3 బిలియన్ డాలర్లు కాగా? గౌతం అదానీ సంపద 80.8 బిలయన్ డాలర్లుగా ఉంది. ఇక, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలోని ప్రధాన వ్యాపారాలైన రిటైల్, ఇంధన రంగాలు ఇటీవల మెరుగైన పనితీరు కనబర్చకపోవడమే ముఖేష్ అంబాని పరిస్థితికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చమురు, రసాయన విభాగంలో డిమాండ్ తగ్గడం, రిటైల్ వినియోగదారుల వ్యయాలు తగ్గడం, చైనా ఎగుమతుల నుంచి పోటీ వంటివి అంబాని సంపదకు ఎసరు పెట్టాయి. ఈ క్రమంలో, కంపెనీకి పెరుగుతున్న అప్పులపైనా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. రిలయన్స్ షేర్లు తగ్గుతూ వచ్చింది. అలాగే, ఇటీవల మీడియా, ఏఐ కంప్యూటింగ్‌లో ఆధిపత్యం కోసం అంబానీ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టడం కూడా సంపద డౌన్‌ఫాల్‌కు కారణమయ్యింది. మరోవైపు, గౌతమ్ అదానీ సంపద గత కొన్నేళ్లుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతోంది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ వెలువడగా.. గరిష్ఠ స్థాయిల నుంచి సంపద భారీగా తగ్గింది. మధ్యలో మళ్లీ పుంజుకున్నప్పటికీ.. ఇటీవల వరుస ఆరోపణలు, దర్యాప్తులతో మళ్లీ షేర్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అయితే, గతంలోలాగా మళ్లీ మదుపరుల విశ్వాసం పొందేతే తప్ప ఈ ఇద్దరు కుబేరులు కష్ట కాలం నుండి బయటపడే అవకాశం ఉంది. గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినప్పటికీ? భారతదేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 2024 జనవరి నుంచి 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఊఅఒ టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు. మరోవైపు, ఎలన్ మస్క్ కంపెనీ స్టార్ లింక్ భారత్‌లో ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీనితో, స్టార్ లింక్, భారత్‌లో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ వంటి సేవలు ప్రారంభిస్తే.. ఎయిర్‌టెల్‌తో పాటు అంబానీ సంస్థ జియో కూడా గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది, అంబానీ సంపదకు మరో సవాలుగా మారే ఛాన్స్ ఉంది. అంబానీ తిరిగి నిలదొక్కుకోడానికి చేస్తున్న ఈ వ్యూహాలు దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి. తాజా గ్లోబల్, డొమెస్టిక్ సవాళ్లకు కొత్తగా అమెరికా గద్దెనెక్కబోతున్న ట్రంప్ ప్రెసిడెన్సీ కూడా ఒక రకంగా కారణమేనని కొందరు వాదిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి ఎన్నికైన తర్వాత భారతీయ ఎగుమతులపై కొత్త ట్యాక్స్‌లను మోపుతున్నారు. దీని వల్ల భారతీయ వ్యాపారాలకు సంభావ్య వాణిజ్య సవాళ్లు ఎదురవుతాయనే భయం కూడా అందరిలో కనిపిస్తోంది. అయితే, దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశ ఎగుమతులు పోటీలో నిలదొక్కుకోలేవని అంటున్నారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ? దేశంలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి అవకాశాలను అందిస్తూనే ఉండటాన్ని మంచి పరిణామంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నాయకపోడ్ దెబ్బ మండల ఇంఛార్జ్ గా బానారి సమ్మయ్యనాయక పోడ్

### - అధికారికంగా ప్రకటించిన ఇంఛార్జ్ గాలి సమ్మయ్యనాయక పోడ్



వెంకటపూరం, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): వెంకటపూరం మండల కేంద్రంలో నాయకపోడ్ దెబ్బ ములుగు జిల్లా కో చైర్మన్ గుర్రపు రామరావు అధ్యక్షతన మండల కేంద్రంలోని నాయకపోడ్ గూడెం లో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకపోడ్ దెబ్బ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంఛార్జ్ గాలి సమ్మయ్యనాయక పోడ్ మాట్లాడుతూ ఆగస్టు 1టవ తారీకు న భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ ఎస్టీలకు వర్గీకరణ తోనే అన్ని రంగాలలో అభివృద్ధి అని ఏడుగురు జడ్జీల అత్యున్నత ధర్మాసనం తీర్పు ఇవ్వడం ఎస్సీ ఎస్టీ లలోని చిన్న తెగలు ఉపకులాలకు వారి, వారి జనాభా నిష్పత్తి ప్రకారం సమ, సమ సామాజిక న్యాయం అన్ని రంగాలలో సమ న్యాయం జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఆదిశగా ఆదివాసి పల్లెలు గ్రామాలు, గూడాలు నాయక పోడ్ తెగను, ఆదివాసీల ఐక్యత - చైతన్యం - రాజ్యాధికారం అనే ఎజెండా తో అణగారిన వర్గాల ప్రజలను చైతన్యం చేయుటకు వెంకటాపురం మండల నాయకపోడ్ దెబ్బ మండల ఇంఛార్జ్ గా బానారి సమ్మయ్య నాయకపోడ్ తో మండల ముఖ్య బాధ్యులను అధికారిక కమిటీని ప్రకటిస్తున్నాం. నాయకపోడ్ దెబ్బ మండల కోఆర్డినేటర్ గా ఇండ్ల లక్ష్మీనారాయణనాయక పోడ్, ఆర్గనైజింగ్ కన్వీనర్ గా ఉమ్మడి నరసింహనాయక పోడ్, సోషల్ మీడియా ఇంఛార్జ్ గా భానారి సురేష్ నాయక పోడ్, గార్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగింది.

ఈ సందర్భంగా బానారి సమ్మయ్యనాయకపోడ్ మాట్లాడుతూ షెడ్యూల్ తెగలలో విద్య ఉద్యోగ ఉపాధి సంక్షేమ రంగాలలో సమ న్యా పోరాటం లో నన్ను నాయకపోడ్ దెబ్బ కార్యకర్త నుండి నాయకునిగా తయారు చేసిన నాయకపోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బ సుధాకరన్న నాయకపోడ్ గార్కి, నాయకపోడ్ దెబ్బ వ్యవస్థాపక కో ఆర్డినేటర్ దళిత రత్న అవార్డు గ్రహీత నెమలి నర్సయ్యమాదిగ నాయకపోడ్ దెబ్బ వర్కింగ్ కమిటీ సభ్యులు బోల్లెం సారయ్య నాయకపోడ్ కి ఆదివాసి నాయకపోడ్ దెబ్బ ఉద్యోగుల విభాగం సమన్వయకర్త పత్తిరి వెంకటేశ్వర్లునాయకపోడ్ గార్కి, ఆదివాసీ సంఘాలు - మాదిగ దండోరా సంఘాల సమన్వయకర్త వావిలాల స్వామీ మాదిగ కి, ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ యువ సేన విభాగం జాతీయ సమన్వయ కర్త ఇండ్ల సమ్మయ్యనాయక పోడ్ కి, నాయకపోడ్ దెబ్బ విద్యార్థి విభాగం తెలంగాణ స్టేట్ ఇంఛార్జ్ ఉనేని మధునాయక పోడ్ కి, ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గంటమోరీ భాగ్యలక్ష్మీనాయకపోడ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులా

### - కక్షసాధింపులపై కాదు ప్రజాపాలనపై దృష్టి పెట్టండి
### - మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



హనుమకొండ, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన పక్కన పెట్టేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ లక్ష కోట్ల అవినీతి అన్నాడు. ఫోన్ టాంపరింగ్ కేసులన్నాడు డ్రగ్స్ అని ఆర్భాటం చేశాడు ఒక్కటి కూడా రుజువు చేయలేక పోయిండు. ఇప్పుడు కొత్తగా ఈ కార్ రేస్ లో అవినీతి అని కొత్త డ్రామా మొదలు పెట్టాడు. శుక్రవారం వస్తె కొత్త డ్రామా మొదలు పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ప్రజాపాలనపై దృష్టి పెట్టింది లేదు. ఈ కార్ రేస్ లో అవినీతి జరిగితే అసెంబ్లీలో చర్చపెట్టమని ఈ రోజు కూడా అసెంబ్లీ అడిగితే దానికి సమాధానం లేదు పైగా అసెంబ్లీ సాక్షిగా పేపర్లతో. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేశారు. ప్రపంచ దేశాలలో జరిగే ఈ కార్ రేసింగ్ ని ఇండియాలో మన హైదరాబాద్ లో జరిగేలా కృషి చేసిన ఘనత కేటీఆర్ది ప్రపంచపటంలో తెలంగాణలోని హైదరాబాద్ ని నిలబెట్టిన ఘనత కేటీఆర్ ది, కేటీఆర్ నాయకత్వంలో ఐటి, ఇండస్ట్రియల్, ఫార్మా రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయి. వేములవాడ రాజన్న సన్నిధిలో మీటింగ్ పెట్టి నీ ఒక్కని ప్లేట్ భోజనానికి రూ. 32000/- బిల్లు పెట్టినవు. 100 మందికి రూ. 32 లక్షల బిల్లు పెట్టారట దానిపైన ఎంక్వైరీ లేదు. ఆరునెలల నుండి ఏదో అక్రమ కేసు పెట్టి కేటీఆర్ ని అక్రమ అరెస్ట్ చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే కేటీఆర్ ని అరెస్ట్ చేసి చూడు.. ఏమవుతాదో తెలుస్తది. గ్రామాలలో పర్యటించండి అప్పుడు తెలుస్తది మీ పరిస్థితి.. మీ పార్టీ పరిస్థితి ఇప్పటికి గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై చర్చించే సమయం నీకుండదు, ఓవర్సీస్ స్కాలర్ షిప్ లో 20 లక్షల సాంక్షన్ చేయడానికి 5 లక్షలు అడుగుతున్నారనట దానిమీద ఎంక్వైరీ చెయ్, గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వలేదు. వారికి కుటుంబాలు రోడ్డుపైన పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతుబంధు పైసలు 7 వేల పొంగులేటి ఇవ్వలేదా పొంగులేటిపై జరిగిన ఈడిదాడులు సంగతి ఏంది. ఇప్పటికైనా ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులు ఆపి ప్రజాపాలనపై, రాష్ట్ర అభివృద్ధికై దృష్టి సారించితే మంచిది.

# జిల్లాలో విస్తృతంగా జిల్లా కలెక్టర్ పర్యటన





### ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పాఠశాలలు, వసతి గృహాలు ఆరోగ్య కేంద్రాల తనిఖీలు

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పాఠశాలలు, వసతి గృహాలు, మోడల్ స్కూల్స్, కలవల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం, ఇందిరమ్మ ఇండ్ల సర్వే కేసముద్రం మండలం, పెనుగొండ, బోడ మచ్చ తండలలో, లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పక్కగా నిర్వహించాలని అన్నారు. కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక మందుల స్టాక్ వివరాలు ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ప్రతి రోజు షెడ్యూలు ప్రకారము వైద్య పరీక్షలు, శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు, సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న కిచెన్ గదిని స్వయంగా సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించదని తెలిపారు. తరగతి గదులలో పిల్లలతో మాట్లాడుతూ చదువుపై ఆసక్తితో ఉండాలని కేవలం విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చు అని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణంలోని పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని విద్యా, సానిటేషన్ వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రత్యేక అధికారులు సైతం క్షేత్రస్థాయిలో వసతి గృహాలు తనిఖీ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డి, సంబధిత శాఖల అధికారులు ఉన్నారు.

# గంజాయి, మత్తుపదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం..

తొగుట: గంజాయి ఇతర మత్తుపదార్థాల పై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని తొగుట సిఐ ఎస్కే లతీఫ్ అన్నారు. గురువారం మండలంలోని తుక్కాపూర్ పరిధిలోని కెఎన్ఆర్ కంపెనీలో డ్రగ్ కిట్స్ తో గ్రామంలో ఉన్న కిరాణా షాపులో కెఎన్ఆర్ కంపెనీ పరిసర ప్రాంతాలలో ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో వివిధ రాష్ట్రాల కార్మికులను గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్‌తో అనుమాన స్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను ఒక కంటితో కనిపెట్టా లన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసిన, పాన్ షాపుల లో, ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయిం చిన వెంటనే డయల్ 100 లేదా తొగుట పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# రూ. 5లక్షలతో ప్రగతి పనులు



### బీరప్పగడ్డలో భూగర్భ డ్రైనేజీ పనులు : మేయర్ శాంతి

జవహర్ నగర్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): కార్పొరేషన్లో ప్రగతి పనులు అద్భుతంగా జరుగుతున్నాయని మేయర్ శాంతి అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్లోని 22వ డివిజన్ కార్పొరేటర్ లావణ్యసతీష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ నిధులు రూ. 5లక్షలతో బీరప్పగడ్డకాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాయికుమార్, వేణు, శారదామనోధర్రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గ్రీసులో బోటు మునక. 8 మంది మృతి



హైదరాబాద్ : గ్రీసు దీవుల్లోని రోడ్స్ ఐలాండ్‌లో బోటు మునిగిపోయింది. ఆ ఘటనలో 8 మంది మృతిచెందగా, మరో 18 మందిని రక్షించారు. పెట్రోలింగ్ నౌకను తప్పించుకునే ప్రయత్నంలో.. స్పీడ్‌బోట్ చేసిన విన్యాసాలు ప్రమాదానికి దారి తీశాయి. కోస్టుగార్డు నౌకలు, హెలికాప్టర్లతో గాలింపు చేపడుతున్నారు. ఇంకా ఎంత మంది ప్రయాణికులు మిస్సవుతున్నారో చెప్పడం కష్టంగా ఉన్నది. టర్కీ కోస్టు తీరానికి సమీపంలో ఉన్న రోడ్స్ దీవుల్లో ప్రమాదం జరిగింది. అయితే ఈ రూటులో ఎక్కువగా అక్రమ రవాణా జరుగుతుంది. గడిచిన వారం రోజుల్లో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి. వారంక్రితం కూడా మునిగిన బోటు ఘటనలో ఏడు మంది మరణించారు. ప్రతి ఏడాది గ్రీసుకు అక్రమంగా ప్రవేశిస్తున్న శరణార్థుల సంఖ్య 60 వేలకు చేరుకున్నది. సిరియా నుంచి అత్యధిక స్థాయిలో వలసలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ఆఫ్ఘన్, ఈజిప్టు, ఎరిత్రియా, పాలస్తీనా ఉన్నాయి.

# అమిత్ షా దిష్టిబొమ్మ దహనం..

తెలుగునాడు, ఆర్మూర్ : ఆలూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మాదిగ యువజన నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేత్కర్ పై అమితాషా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేకుంటేవ్ ఉద్యమం ఉధృతం చేస్తామని, అనుచిత వాక్యాలును కండిస్తూ ఆలూర్ లో దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అగ్గు క్రాంతి, పెండ భాస్కర్, ప్రదీప్, బంజారా జాన్, సజన్, రవి, భోజన్న, నవనీత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 100 సంవత్సరాల మెదక్ చర్చి



మెదక్: మెదక్ కేథడ్రల్.. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఒకటి. దీనిని బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులకు చెందిన చార్లెస్ వాకర్ పోస్నెట్ నిర్మించారు. 1914 - 1924 మధ్య దాదాపు 10 సంవత్సరాల నిర్మాణం తర్వాత.. డిసెంబర్ 25, 1924న దీన్ని ప్రారంభించారు. బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులు మెదక్ చర్చిని నిర్మించారు, దీనిని డిసెంబర్ 25, 1924న పవిత్రం చేశారు. 1914లో కరువు సమయంలో.. ఈ ప్రాంతానికి సహాయం చేయడానికి.. పనికి ఆహారం కార్యక్రమంలో భాగంగా ఈ చర్చిని నిర్మించారు. మెదక్ చర్చిని గోతిక్ రివైవల్ శైలి కేథడ్రల్, ఎత్తైన స్తంభాలు, తడిసిన గాజు కిటికీలు, రాతి శిల్పాలతో నిర్మించారు. ఇది 100 అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవు ఉంటుంది. దాదాపు 5,000 మందికి వసతి కల్పించగలదు. చర్చి పైకప్పు బోలు స్పాంజ్ మెటీరియల్‌తో సౌండ్‌ప్రూఫ్‌తో నిర్మించారు. బెల్ టవర్ 175 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ చర్చి తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఉంది. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఇది ఒకటి. మరో విశేషం ఏంటంటే.. భారతదేశంలో ఎక్కువ ఫొటోలు తీసింది ఈ చర్చినేమెదక్ చర్చి దక్షిణ భారతలో బిషప్ స్థానం దక్కించుకుంది. మెదక్ డయోసెస్ ఆసియాలో అతిపెద్దది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద డియోసెస్ ఇక్కడే ఉంది. మెదక్ చర్చిలో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. విదేశాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తారు. క్రిస్‌మస్ రోజున ఈ చర్చి లోపల బోధించే ప్రసంగం పట్టణం అంతటా వినబడుతుంది. మెదక్ కోట వరకు బోధనలు వినబడతాయి

# టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సెరికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. టస్సార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలుపై నివేదిక అందించాలని ఆదేశించారు. టస్సార్ పట్టుకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ అనుకున్న మేరకు మార్కెటింగ్ జరగడం లేదని అన్నారు. మార్కెటింగ్ పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టస్సార్ చేనేత వస్త్ర కార్మికులకు ఇచ్చే రాయితీలను అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టస్సార్ పట్టు కాయలు ఎండబెట్టుటకు కావాల్సిన ఫ్లాట్ ఫారాల నిర్మాణానికి కావలసిన పాలనా పరమైన అనుమతులకు నివేదిక ఇవ్వాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక మహిళా బృందాలకు టస్సార్ పట్టు దారం



తీయుటలో అవసరమైన మెళకువలు కొరకు శిక్షణా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు దారం తీయడానికి కావల్సిన అధునాతన మిషన్లను అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ, హార్టికల్చర్ అధికారి సునీల్, సూపరింటెండెంట్ రాజు, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ, విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో జిల్లా స్థాయి న్యూట్రిషన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార లోపాలు, వాటి పరిష్కారాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. చిన్నారుల, గర్భిణీల, బాలింతల ఆరోగ్య సంరక్షణ కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరంతర పర్యవేక్షణ, సమాచార సేకరణను కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలకు పోషకాహారం పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల తల్లుల కోసం ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక ఆహారం పంపిణీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆరోగ్య బృందాల ద్వారా హెల్త్ క్యాంపులు నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంగన్ వాడి కేంద్రాలలో కిచెన్ గార్డెన్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం పోషన్ వాటికలో భాగంగా జిల్లాలో 31 అంగన్వాడి కేంద్రాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంచాలని పంచాయితీ కార్యదర్శులు, ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుపై జాబితా ఇవ్వాలని సూచించారు. ఐదు సంవత్సరాల లోపు



పిల్లల ఎత్తు, బరువు పరిశీలించాలని అన్నారు. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. పిల్లలు వ్యక్తి గత పరిశుభ్రత, పాలిచ్చే తల్లులు న్యూట్రిషన్ లోపాలను గుర్తించి ఐరన్ ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ లాంటి న్యూట్రిషన్ మందులు అందించాలని సూచించారు. నులిపురుగుల వల్ల చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని వైద్యుల సలహాలు, సూచనాలతో డి వార్మింగ్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. అస్ప్రేషనల్ డిస్ట్రిక్ లలో భాగంగా మన జిల్లా దేశంలోనే 12వ స్థానంలో ఉందని, కేటాయించిన 6 యాస్పిరేషన్ పారామీటర్ల లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయిలో అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, విద్యాశాఖ అధికారి రాజేందర్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డిఆర్డీఓ నరేష్, సిపిఓ బాబురావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ నిర్మల, ఆర్డీవో మంగీలాల్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సు శిక్షణ

### జిల్లాలో ఈ నెల చివర్లో స్కిల్ సెంటర్ ప్రారంభం

### జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్

ములుగు జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని యువత ఉద్యోగాలు సాధించడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవడానికి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ సంస్థ (టాస్క్) ద్వారా ఈ నెల చివర్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జి అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరులు, సేవలను మరియు ప్రభుత్వం అకాడెమియాల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన లాభాపేక్ష లేని సంస్థ అని అన్నారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ %ఉ% గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతొ యువత ఉద్యోగాల సాధించడానకి కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవడానికి అవసరమైన స్కిల్ సెంటర్ ను డిసెంబర్ లో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు దిగ్గజ సంస్థలో ఉద్యోగవకాశాలు కల్పించడానికి అవసరమైన నైపుణ్యాలు ఆంగ్లంలో మాట్లాడటం, ఇంటర్వ్యూలు ఎదుర్కొనేల, ఆత్మ విశ్వాసం, వ్యక్తిగత సామర్థ్యాలు



పెంచడం, బృందాలు నడిపించగల నైపుణ్యాలను టాస్క్ శిక్షణా కేంద్రల ద్వారా నిరుద్యోగ యువతకు టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సు శిక్షణ ఇవవనున్నట్ల ఇట్టి శిక్షణ తరగతులకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ వంటి కోర్సులు చదివి 18 నుంచి 35 ఏళ్ల లోపున్న అభ్యర్థులు, ఆసక్తి కలిగినా వారు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 23 సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా ఉపాధి కల్పన అధికారి, ములుగు జిల్లాలి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాలకు

8886220324

9440348961 నెంబర్లకు

కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# కొన ఊపిరితో ఉన్న తల్లి బిడ్డలకు కాపాడిన వైద్య సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ప్రసవ వేదనలో భద్రాచలం ఆసుపత్రికి ప్రసవం కోసం వచ్చి మూర్ఛకి లోనై, అపస్మారక స్థితిలో కొన ఊపిరితో బిడ్డకు జన్మనిచ్చి సుమారు వారం పాటు వెంటిలేటర్ పై ఉన్న తల్లికి, అపస్మారక స్థితిలో పుట్టిన బిడ్డకి ఊపిరి అందించిన భద్రాచలం వైద్యులు మరియు వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అభినందనలు తెలిపారు. తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం వైద్య సిబ్బంది చూపించిన శ్రద్ధ పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే చర్ల మండలం రాళ్లపురం గ్రామానికి చెందిన 39 ఏళ్ల కుంజం ముయ్యమ్మ, ఈనెల 11 వ తారీఖున ప్రసవం కోసం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆమెకి తరచుగా తొమ్మిది మార్లు మూర్ఛ రాగా, అధిక రక్తపోటుతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో మందులకు కూడా మూర్ఛ తగ్గకపోవటంతో తల్లిని సంరక్షించుటలో భాగంగా వైద్యులు ఆపరేషన్ చేసి బిడ్డను డెలివరీ చేశారు. పుట్టిన బిడ్డ కూడా విగత జీవిగా పుట్టగా, భద్రాచలం వైద్యులు శ్రమించి ఆ బిడ్డకు ప్రాణం పోశారు. అపస్మారక స్థితిలో ఉన్న తల్లిని సైతం వెంటిలేటర్ పై ఉంచి వారం పాటు చికిత్స అందించారు. ఈనెల 19వ తారీఖున ఐసీయూ నుండి తల్లి బిడ్డలను క్షేమంగా డిస్చార్జ్ చేశారు. ఈ క్రమంలో ఎంతో శ్రమించి తల్లిని బిడ్డని కాపాడి ఊపిరి పోసిన ప్రసూతి వైద్యులైన డాక్టర్ ప్రమీల, డాక్టర్ సాత్విక మరియు మత్తువైద్యులైన డాక్టర్ నిఖిత మరియు పిల్లల వైద్యులైన డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ రావులను మరియు





ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రామకృష్ణ లను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మరియు డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు అభినందించారు. ఇదే స్పూర్తితో భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంతంలో మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యులను సూచించారు.

ఆసుపత్రుల రోగుల చికిత్స దృష్ట్యా ఎటువంటి అవసరాలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సత్వరమే సమీక్షించి ఆ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్





ములుగు జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టర్ టీఎన్జీవోస్ యూనియన్ ములుగు జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించినారు. ములుగు TNGOS యూనియన్ జిల్లా అధ్యక్షులు పోలు రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగస్తులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అమలుపరచుటలో ముందంజలో ఉంచి మన జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని కోరినారు, ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా నేను మీ వెంట ఉంటాను అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలు రాజు అధ్యక్షులు మాట్లాడుతూ కలెక్టర్ కలెక్టర్ యూనియన్ కి ఈ భవనాన్ని కేటాయించినందుకు మరియు మరియు కలెక్టర్ స్వయంగా వచ్చి ప్రారంభించినందుకు వారికి ఉద్యోగులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి శ్రీమతి మేడి చైతన్య మరియు %Tngos% రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫీ సర్కార్, కోశాధికారి భూక్యలాల్ నాయక్, కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ , రాంగోపాల్, సునీత, శ్రీవాణి , సరిత, జైసింత, ఆర్గనైజ్ సెక్రెటరీ,ప్రదీపు అనీల్, ప్రశాంత్, ఉదయ్ కుమార్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సిహెచ్ రాజు, భాస్కర్, అనిల్ కుమార్, రమాదేవి, రవీందర్ యశ్వంత్, నాగార్జున రఘు ప్రసాద్, యుగంధర్ రెడ్డి, శ్రావ్య ఉదయ్ కుమార్ రెడ్డి ప్రశాంత్ మరియు టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉపన్యాస పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

### – ఆచార్య రాధాకృష్ణ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఆర్థిక బహుమతులు

హనుమకొండ, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): విద్యార్థులలో దాగి ఉన్న గణిత ప్రతిభను వెలికితీయడానికి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. గురువారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో "రామానుజన్ జీవితం మరియు గణితం పట్ల ఆయన కృషి" అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లాలోని డిగ్రీ మరియు పీజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో జరగబోయే




గణిత దినోత్సవ సందర్భంగా ప్రశంసా పత్రం తో పాటు మెమెంటోను విశ్రాంత ఆచార్యులు ఎస్.ఎస్.వి.ఎన్. శర్మ మరియు ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి అందజేయనున్నారు. అదేవిధంగా, మొదటి, రెండవ, మూడవ బహుమతులు సాధించిన విద్యార్థులకు ఆచార్య రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఆర్థిక బహుమతులు అందజేయనున్నట్లు గణిత విభాగ ఇన్చార్జి డాక్టర్ తండు నాగయ్య తెలిపారు.

# జిల్లాల కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 112 ఆకాంక్షిత జిల్లాలు మరియు 500 ఆకాంక్షిత మండలాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు జరిగినటువంటి సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలను అన్ని ఆకాంక్షిత జిల్లాలు మరియు ఆకాంక్షిత మండలాలు విజయవంతంగా పూర్తి చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యా, వైద్యం,ఆరోగ్యం మరియు వ్యవసాయ రంగాలలో ఇచ్చినటువంటి లక్ష్యాలను సంపూర్ణంగా సాధించగలిగాము అని తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను వచ్చే సంవత్సరం ఫిబ్రవరి లోపు పూర్తి చేయాలని అన్ని ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆకాంక్షిత జిల్లాల మరియు మండలాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా మరియు ఆకాంక్షిత మండలమైన గుండాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సిపిఓ సంజీవరావు మరియు యాస్పిరేషన్ బ్లాగ్ ప్రోగ్రాం ఫెలో నవనీత్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.ప్రచురణార్థం 20-12-2024 ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం. ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 112 ఆకాంక్షిత జిల్లాలు మరియు 500 ఆకాంక్షిత మండలాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి



జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు జరిగినటువంటి సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలను అన్ని ఆకాంక్షిత జిల్లాలు మరియు ఆకాంక్షిత మండలాలు విజయవంతంగా పూర్తి చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యా, వైద్యం,ఆరోగ్యం మరియు వ్యవసాయ రంగాలలో ఇచ్చినటువంటి లక్ష్యాలను సంపూర్ణంగా సాధించగలిగాము అని తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను వచ్చే సంవత్సరం ఫిబ్రవరి లోపు పూర్తి చేయాలని అన్ని ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆకాంక్షిత జిల్లాల మరియు మండలాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా మరియు ఆకాంక్షిత మండలమైన గుండాల లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సిపిఓ సంజీవరావు మరియు యాస్పిరేషన్ బ్లాగ్ ప్రోగ్రాం ఫెలో నవనీత్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీగా మారిన స్టేషన్ ఘనపూర్

### – అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్ బాబు

### – ముఖ్యమంత్రి రేవంత్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కడియం



స్టేషన్ ఘనపూర్, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): స్టేషన్ ఘనపూర్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు అసెంబ్లీ సమావేశాలలో భాగంగా మున్సిపల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అసెంబ్లీ వేదికగా స్టేషన్ ఘనపూర్ గ్రామాన్ని మున్సిపాలిటీగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే కడియం శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చి స్టేషన్ ఘనపూర్ రూపు రేఖలు మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అడిగిన వెంటనే కాదనకుండా నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరిసారి ధన్యవాదములు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలి

## జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సత్య శారద దేవి



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఈ నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వరంగల్ మున్సిపల్ పరిధి లోని క్రిస్టియన్ కాలనీ, (లేబర్ కాలనీ) హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం, అక్కంపేట గ్రామాలలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాల పనితీరును, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డు లో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల 2 బిహెచ్కెనోడల్ అధికారు లు రాజేందర్, జి రామ్ రెడ్డి , తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి , మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఆర్ ఐ సునీల్, ఆర్ ఓ శ్రీనివాస్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



వరంగల్ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక్క దరఖాస్తూను వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యు మెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లతో సహకరించాలని సూచించారు.
ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వే పారదర్శకంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసీ కాశిబుగ్గ సర్కిల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరు పరిశీలన
## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





జనగామ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సర్వేయర్ లను ఆదేశించారు. శుక్రవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది.. రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు.. ఆన్లైన్ లో ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేశారని? సర్వేయర్ లను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని, సర్వే పూర్తయ్యాక ప్రతి ఇంటి నంబర్ లను రాసుకోవాలని, తద్వారా సర్వేయర్ లు తికమక పడకుండా ఆయా ఇళ్లలో సర్వే పూర్తయినట్లు తెలుస్తుందన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ధి చేకూర్చేందుకు దరఖాస్తు చేసుకున్న వారి సమగ్ర వివరాలను సేకరించి, తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఆన్లైన్ నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం అదే మండలంలోని ఖిలాషాపూర్ గ్రామ పంచాయతీలో కొనసాగుతోన్న ఈ సర్వే సరళిని పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి, ఎంత మంది ఇంట్లో ఉంటారు.. ఇది సొంత ఇళ్లేనా.. ఇక్కడే కొత్త ఇల్లు కట్టుకుంటారా.. లేదంటే వేరే ఎక్కడైనా ఏమైనా నివేశన స్థలం ఉందా.. ఎన్ని గజాలు ఉంది.. అని తదితర అంశాలపై క్లుప్తంగా వివరాలను సేకరించి, సర్వేయర్ లతో యాప్ లో నమోదు చేయించారు. దరఖాస్తుదారుల ఇంటి చిత్రాలను స్పష్టంగా తీసి, అప్లోడ్ చేయాలని, స్థలం, ఇంటికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వివరాల నమోదులోఎటువంటి నిర్లక్ష్యం తగదని, ఈ సర్వే ప్రక్రియలో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ హాసిమ్, ఎంపిడిఓ శ్రీనివాస్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 21న అరుదైన ఘటన..
# రాత్రి 16గంటలు..పగలు 8గంటలు




హైదరాబాద్: సాధారణంగా ఒక రోజు అంటే.. పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలు ఉంటుంది. అయితే శీతాకాలంతో పాటు కొన్ని సార్లు పగలు ఎక్కువగా ఉండటం, రాత్రుళ్లు తక్కువగా ఉండటం.. పగలు తక్కువగా ఉండి, రాత్రుళ్లు ఎక్కువగా ఉండటం జరుగుతుంది. సాధారణంగా ఇలా జరిగే ప్రక్రియను "అయానంతం" (సోల్?స్టీస్) అంటారు. తాజాగా అలాంటి రోజు ఈ ఏడాది డిసెంబర్? 21వ తేదీన రాబోతుంది. ఈ రోజున పగటి సమయం(8గంటలు) తక్కువగా, రాత్రి సమయం (16గంటలు) చాలా ఎక్కువగా ఉంటోంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజున సూర్యుని నుండి భూమికి దూరం ఎక్కువగా ఉంటుంది. అలాగే చంద్రకాంతి భూమిపై ఎక్కువ కాలం ఉంటుంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడిన రోజున భూమి దాని ధ్రువం వద్ద 23.4 డిగ్రీల వంపులో ఉంటుంది. ఈ సహజ మార్పు కారణంగా 2024, డిసెంబరు 21న ఈ ఏడాదిలో అత్యంత తక్కువ పగలు, సుదీర్ఘమైన రాత్రి ఏర్పడుతుంది.భూమి దాని అక్షం మీద తిరిగే సమయంలో దక్షిణ అర్ధగోళంలో భూమి నుండి సూర్యుడి దూరం గరిష్టంగా ఉన్న రోజున అయనాంతం వస్తుంది. ఇది ఏటా రెండుసార్లు జరిగే ఘట్టం. శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజు, తేదీ ఏటా మారుతూ ఉంటాయి.ఇక ఈ ఏడాది 21వ తేదీన ఈ అరుదైన ఘట్టం సంభవిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.అయితే అది డిసెంబర్ 20- 23 తేదీల మధ్యనే వస్తుంటుం ది. డిసెంబర్ 21న భూమికి సూర్యునికి గరిష్ట దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమిని చేరుతాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతలో స్వల్ప తగ్గుదల కూడా కనిపిస్తుంది.దీంతో శీతాకాలంలో ఏర్పడే అయనాంతంపై పలు దేశాలలోని ప్రజలు పలురకాల నమ్మకాలను పాటిస్తుం టారు.

# కంటి ఆసుపత్రులను తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్వో





మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 20 (తీన్మార్ న్యూస్): శుక్రవారం స్థానిక మహాలక్ష్మి కంటి ఆసుపత్రి మరియు సూర్య కంటి ఆసుపత్రులను డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ప్రమీలరావ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి గ్రీవెన్స్ సంబంధించిన నాలుగు కేసుల చికిత్సల వివరాలను అడిగి తెలుసుకుని వారి యొక్క కంటికి సంబంధించిన చూపు మరియు అంశములపై అడిగి తెలుసుకున్నారు అలాగే ఆస్పత్రి రికార్డులను సమర్పించాలని కోరారు. ఏవైతే నాలుగు కేసుల యొక్క వివరాలు వాటిని పరీక్షించుటకు వారి యొక్క కాన్సెంట్ఫాములను ఆపరేషన్ సర్టిఫిట్ లను సమర్పించాలని తెలిపారు. అలాగే ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని శానిటేషన్ బాగా ఉండాలని వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అలాగే బెడ్స్ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ సర్టిఫికెట్స్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్స్ అన్ని జిరాక్స్ కాపీలను ఆఫీస్ కు ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీలో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డే బోయిన శ్రీనివాస్ హెల్త్ ఎడ్యుకేటర్ గీత, డాక్టర్ సుధీర్ కుమార్ మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పిల్లి గోవర్ధన్ పాల్గొన్నారు.

# సమ్మెలో సమగ్రం.!

## – స్తంభించిన విద్యావ్యవస్థ
## – కెజిబివిలో నిలిసిన బోధన




మల్హర్ రావు: తమ సమస్యల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.ఈనెల 10 నుంచి విధులు బహిష్కరించి రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు.నేటికీ 11 రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే వీరి సమ్మె ప్రభావం విద్యావ్యవస్థపై తీవ్రంగా పడింది. విద్యాశాఖలో అనేక రకాల సేవలు పూర్తిగా స్తంభించాయి.కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో బోధన కుంటుపడింది.

**స్తంభించిన విద్యా వ్యవస్థ..**

మండలంలోని కేజీవిబి పాటశాలలో 13మంది ఉపాధ్యాయురాళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు అత్యధికంగా విద్యాశాఖలోనే ఉన్నారు. పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలిస్తారు. ఇదే కాకుండా బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడం, పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూ డైస్లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం వంటివి చేస్తుంటారు. వీరంతా సమ్మెలో ఉండడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.కానీ ఈ బిల్లుల వ్యవహారం అంతా కంప్యూటర్ ఆపరేటర్లు (సమగ్ర శిక్ష) చూస్తుండడంతో కార్మికులకు బిల్లులు అందకుండా పోయాయి.పాఠశాలలో అనాథ, పేద, మధ్య తరగతి బాలికలు చదువుకుంటున్నారు.కాగా ఈ పాఠశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అంతా సమగ్ర శిక్ష ఉద్యోగులే. వీరు పది రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు.దీంతో బాలికలు చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్ వచ్చింది.మార్చిలో 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి.

# అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలి..

## – బి రెడ్డి సాంబశివ..సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి




గోవిందరావుపేట: జమిలి ఎన్నికల పేరుతో మరోసారి మోసంకు కుట్ర భారత పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ నీ అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ డిమాండ్ చేశారు. మండలంలోని పసర సీపీఐ(ఎం) కార్యాలయంలో సీపీఐ(ఎం) మండల విస్తృతస్థాయి సమావేశం గుండు రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సాంబశివ హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా భారత హోంమంత్రి అమిత్ షా మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని సవరిస్తూ మనుధర్మాన్ని అమలు చేయడం కోసం బిజెపి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను బిజెపి కాలరాస్తుందని అంబానీ ఆదానిలకు ఊడిగం చేస్తూ కార్పొరేట్ సేవలో మునిగిపోయిందని ఆరోపిం చారు. కుల మతాల మధ్య కొట్లాటలు సృష్టిస్తూ దేశ ఐక్యతను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం పేదరికం పెరిగిందని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానం టాయని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను పౌరుల హక్కులను హరిస్తుందని విమర్శించారు. దేశంలో జమిలి ఎన్నికల పేరుతో బిజెపి ప్రభుత్వం నాటకమాడుతుందని జెమిలి ఎన్నికలు కాదని దామాషా ఎన్నికలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతు చట్టాలు రద్దుచేసినామని చెప్పి మరోసారి దొడ్డిదారిన రైతు చట్టాలను తీసుకురావడం కోసం ప్రయత్నిస్తుందని అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులపై లాటి చార్జ్ భాషా వాయు గోళాలను ప్రయోగించి రైతాంగాన్ని మరోసారి దగా చేయడం కోసం కుట్ర చేస్తుందని విమర్శించారు. భారత ప్రజలకు దిక్సూచిగా ఉండే భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ను అవమానపరచడం భారతదేశ ప్రజలను అవమానం పరిచినట్టేనని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యక వాదులు ఐక్యమై మతోన్మాద ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిల్ల చిట్టిబాబు, రఘుపతి మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, మండల కమిటీ సభ్యులు గుండు లెనిన్, క్యాతం సూర్యనారాయణ, కొట్టెం సామ చంద్రారెడ్డి, గోపిశెట్టి ఐలయ్య, ఎస్డి అంజాద్, అంబాల పోషాలు, ముమ్మడి ఉపేంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందాలి..

## – మండల వ్యవసాయ అధికారి మోహన్, ఉద్యాన అధికారి రమేష్..



తొగుట: తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోనే మార్కె టింగ్ సదుపాయం కల్పిస్తామని మండల వ్యవసా య అధికారి మోహన్, ఉద్యాన అధికారి రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద మాసాన్ పల్లి గ్రామ పరిధిలో ఉన్న ఆయిల్ పామ్ పంటలను, 3 వ సంవత్సరంలలో ఉన్న ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాటికి సంబందించిన ఎరువుల యాజమాన్యం మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. అలాగే కొత్తగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీ డ్రిప్ మొక్కలకి ఇవ్వడం ఇస్తా మని అన్నారు. రైతులందరు ఆయిల్ ఫామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. మొక్కలు నాటిన 14 నెలలకు పూత ప్రారంభ మవుతుందని, మొక్క 30 నేలలు వయసు వచ్చే సరికి లేత దశలో మగ, ఆడ పుష్పాలను వస్తాయ న్నారు.వాటి ని తప్పనిసరిగా తొలగించాలన్నారు. తద్వారా చెట్టు యొక్క మాను (మొదలు భాగం) బాగా ఊరుతుందిని అన్నారు. తద్వారా 36 నెలల వయసులో గెలల బరువు బాగా వస్తుందని వివ రించారు. ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చు చెప్పారు. ఐదు సంవత్సరాల తర్వాత ఆయిల్ పాములో కోకో పంట వేసుకోవచ్చు దీనివలన అధిక లాభాలు నికరంగా ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చు అన్నారు. మార్కెటింగ్ లో భాగంగా రైతులకు మన మండలంలో పెద్ద మాసాన్ పల్లి కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నా మని అన్నారు. గేలలు ఫ్యాక్టరీ కి సరఫరా చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతాయని చెప్పారు. 2025 జూన్ నాటికి నంగునూరు మండలంలో ఫ్యాక్టరీ అందుబాటు లోకి రానుందని సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 11 వేలఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగులో చేసినట్లు తెలిపారు. మండలంలో 383 ఎకరాలు సాగులో ఉందన్నారు. ఆయిల్ ఫామ్ తోటలో మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు, ధనియాల వంటి అనేక పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చు వివరిం చారు. ఈ కార్యక్రమంలో రైతులు పణ్యాల నర్సింహా రెడ్డి ,నారాయణరెడ్డి, తిరుపతి గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున్ తదితరులు ఉన్నారు.

# మీకు తెలిసే జీవోలు వచ్చాయా ?

**- సోమేష్, స్మితలకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు**


**- కాళేశ్వరంపై కొనసాగుతున్న విచారణ**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ డిజైన్ల లోపాలు, అవినీతి ఆరోపణలపై నిజాలు నిగ్గు తేలే సమయం ఆసన్నమైంది. ఈ ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ముగింపు దశకు చేరుకున్నది. గత ఆరు మాసాల్లో విడతల వారీగా ప్రాజెక్టు నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్పొరేషన్ చైర్మెన్లు, గుత్తేదార్లను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్, బహిరంగ విచారణలో కీలక అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇప్పటికే తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై చర్యలు తప్పవని స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చిన ఆ కమిషన్ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ లోపాలు, ఆర్థిక అవకతవకలపై గత ప్రభుత్వ హయాంలో ఉన్నత హెూదాలో పని చేసిన కీలక అధికారులను ప్రశ్నిస్తున్నది. ఇందులో భాగంగా గురువారం అప్పట్లో సీఎంవోలో కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన ఐఏఎస్ స్మితా సబర్వాల్ , మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మితా సబర్వాల్ సీఎంవోలో కీలకంగా వ్యవహరించగా, సోమేశ్‌కుమార్ సీఎస్‌గా విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే. స్మితా సబర్వాల్‌ను ప్రశ్నించిన కమిషన్ క్యాబినెట్ ఆమోదం లేకుండానే మూడు బ్యారేజీలకు పరిపాలన అనుమతులు ఇచ్చారా ? అని వివరాలు రాబట్టే ప్రయత్నం చేసింది. కమిషన్ అడిగిన ప్రశ్నలకు స్పందించిన స్మితా సబర్వాల్ ఆ విషయం తనకు తెలియదనీ, అవగాహన లేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎంవోకి వచ్చే ప్రతి ఫైల్‌కు సీఎం ఆమోదం ఉంటుందన్న ఆమె, అందులో తాను ఏడు శాఖలను పర్యవేక్షించానని వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నా పరిధి పరిమితమే అన్న స్మిత సాధారణం సమన్వయాన్ని మాత్రమే చూసుకున్నట్టు తెలిపారని కమిషన్ తెలిపింది. మరోవైపు మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను ప్రశ్నించిన కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్, సోమేశ్ ఇచ్చిన వివరణపై తీవ్రంగా మండిపడ్డారు. బహిరంగ విచారణకు కోర్టు హాల్లోకి పిలిచిన వెంటనే రాకపోవడంతో సోమేశ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకూ స్మితా సబర్వాల్‌ను అడిగిన ప్రశ్నలూ అడగ్గా, తాను బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజీల నిర్మాణం పూర్తయిందని సోమేశ్ కుమార్ బదులిచ్చారు. వాటి అనుమతులు, క్యాబినెట్ తీర్మానాల గురించి తనకు తెలియదన్నారు. ఇతర శాఖల గురించి ఆయన ప్రస్తావించగా%ా% కేవలం బ్యారేజ్‌ల గురించి మాత్రమే చెప్పాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించింది.

# ఉద్దేశపూర్వకంగానే సభాసమయం వృధా

**- సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు**



హైదరాబాద్: కొందరు సభ్యులు ఉద్దేశపూర్వకంగానే సభాసమయాన్ని వృధా చేస్తున్నారనీ, ఈ తప్పిదం అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ఇరువైపుల నుంచీ జరుగుతున్నదని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన జోక్యం చేసుకుని మాట్లాడుతూ..సభ్యులు ప్రశ్నోత్తరాల్లో లేని విషయాలను, వేర్వేరు అంశాలను తమ మాటల్లో జొప్పించి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. దీంతో ఒకట్రెండు ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు సభలో వస్తున్నాయన్నారు. ఒక్క ప్రశ్నపై అరగంటకుపై చర్చ ఏంటి? అని ప్రశ్నించారు. నిబంధనల మేరకు ఒక్కో ప్రశ్నకు ఆరు నిమిషాలు కేటాయించారనీ, సభ్యుల కోరికమేరకు అదనంగా రెండు, మూడు నిమిషాలు మాత్రమే ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అంతకంటే ఎక్కువ సమయం కావాలంటే ఆ అంశంపై ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు.

# అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

**- ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి. స్కైలాబ్‌బాబు**

**- సుందరయ్య పార్క్ వద్ద భారీ నిరసన**

**- రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం**



ముషీరాబాద్: అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. హైదరాబాద్ సుందరయ్య పార్క్ వద్ద కేవీపీఎస్ నగర నాయకులు ఎం.దశరథ్ అధ్యక్షతన ప్లకార్డులు, జెండాలు చేబూని భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయా లని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది అంబేద్కర్‌పై మాత్రమే కాదని, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొన సాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వర్గాల వారికి జరిగిన అవ మానమని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. అమిత్ షా, బీజేపీ నేతలు ఆలోచనలు కులతత్వంతో కూడుకున్నవని, రాజ్యాంగం పట్ల వారికి గౌరవం లేదని మరోసారి రుజువైందని అన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ తరచుగా వ్యక్తం చేసే అసహనం.. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు, ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తోందన్నారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో అన్ని సామాజిక ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.దశరథ్, బి.సుబ్బారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.రమేష్, జి.రాములు, కృష్ణ ప్రసాద్, శంకర్, ప్రేమ, రజిత, లక్ష్మి, జగదీష్, మల్లేష్, శ్రీరాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సర్వేయర్లను నియమిస్తాం

**- ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దుల సమస్యలను పరిష్కరిస్తాం**

**- 30 నుంచి 35 నియోజకవర్గాల్లో సమస్య : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



హైదరాబాద్: రాష్ట్రంలో భూముల సరిహద్దుల సమస్యను పరిష్కరించేందుకు సరిపడ సర్వేయర్లు లేరనీ, మండలానికి అవసరాన్ని బట్టి ఒకరిద్దరు సర్వేయర్లను నియమిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య సరిహద్దుల సమస్య, పోడు భూముల సమస్య 30 నుంచి 35 నియోజకవర్గాల్లో ఉందని మంత్రి చెప్పారు. పోడుభూముల సమస్యను పరిష్కరించేం దుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అయితే, సభ్యులు లెటర్‌హెడ్‌మీద రాసి ఇస్తే వాటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో 892 సర్వేయర్లకు గానూ కేవలం 242 మాత్రమే ఉన్నారని చెప్పారు. వీలైనంత త్వరలో సర్వేయర్లను నియమిస్తామన్నారు. ధరణి సమస్యల విషయంలో సభ్యులు చెప్పినవన్నీ నగ సత్యాలేనన్నారు. ధరణిని ప్రక్షాళన చేసేందుకే భూ భారతిని తీసుకొస్తున్నామని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను సరిదిద్దుతామన్నారు. ఓఆర్‌సీలను పరిష్కరిస్తామనీ, బోగస్ వాటిని నిర్మోహమాటంగా తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల రక్షణకు కృషిచేస్తామని హామీనిచ్చారు.

# సింగిల్ ఎంట్రీ విధానంలో టోల్ ఛార్జీల బాదుడు రద్దు చేయాలి.

రాష్ట్రంలో 65 టోల్ ప్లాజాల వద్ద సింగిల్ ఎంట్రీ విధానంతో వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో కట్టబెడుతున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉంది. దీనికితోడు ఆర్&బి రోడ్లపై కూడా టోల్ ప్రవేశ పెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది పెనుభారం అవుతుంది. ఈ మొత్తం టోల్ విధానాన్ని సమీక్షించి తక్షణం భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రంలో మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉంటే, వాటిలో 65 టోల్ ప్లాజాలలో సింగిల్ ఎంట్రీ విధానం తీసుకువచ్చి రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ రుసుములు పూర్తిస్థాయిలో వసూలు చేసి వాహనదారులపై కేంద్రప్రభుత్వం భారం మోపుతున్నది. ఈ విధానం వలన అద్దె వాహనాలు నడుపుకునేవారిపై తీవ్ర ప్రభావం పడి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయి. దగ్గర దగ్గర రెండు నగరాల మధ్య తిరిగే డైలీ వాహనాదారులకు మోయలేని భారం ఇది. ఉదా: గుంటూరు – విజయవాడ మధ్య గత సెప్టెంబరు వరకు ఒకకారు ఒకసారి వెళ్లి తిరిగివచ్చినందుకు రూ.160లు చెల్లించేవారు. ఒకసారి టోల్ చెల్లించిన తరువాత 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా రుసుము చెల్లించాల్సినవసరం లేదు. కాని కొత్త నిబంధనల ప్రకారం రూ.160లను రూ.240లకు పెంచారు. ఈవిధంగా రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240లు చెల్లించాల్సిందే. ఇదే విధంగా అన్ని రకాల వాహనదారులపై భారం పడుతుంది. సిఆర్‌డిఎ పరిధిలో టోల్ ప్లాజాలను ఎత్తివేయాలి. 20కి.మీ లోపల తిరిగే వాహనాలకు గతంలో పసుపు, తెలుపు బోర్డుల పేరుతో పాస్‌లు ఇచ్చేవారు. వీటికి నెలకు రూ.340లు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు పసుపు బోర్డుకు పాస్‌లు పూర్తిగా రద్దు చేశారు. తెలుపు బోర్డు వాహనాలపై రుసుములు పెంచారు. దీనివలన సొంత వాహనదారులపై కూడా భారం పెరగనున్నది. ఆర్‌టిసి పై అదనపు భారం పడుతుంది. ప్రజా రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. కాబట్టి వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది.

# అంబేద్కర్ వివాదం... పార్లమెంట్ లో ఆందోళనలు


న్యూఢిల్లీ: పార్లమెంటు ఆవరణలో ఘర్షణ కారణంగా గాయపడిన భారతీయ జనతా పార్టీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి, మరో పార్టీ ఎంపీ ముఖేష్ రాజ్‌పుత్‌ని ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో చేర్చారు. ముగ్గురు కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, అర్జున్ రామ్ మేఘ్వాల్, పీయూష్ గోయల్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దురుసు ప్రవర్తనతో గాయపడిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సారంగి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సహా పలువురు సభ్యులతో కలిసి ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో బీజేపీ ఎంపీలను పరామర్శించారు. బీజేపీ ఎంపీల ఆరోగ్యంపై ప్రహ్లాద్ జోషి ఆందోళన వ్యక్తం చేశారుఅసలే జరిగిందంటే, పార్లమెంటు ఆవరణలో విపక్ష నేతలంతా నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ హౌస్‌లోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం కింద విపక్షాల ఎంపీలు నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రదర్శనలో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే రాహుల్ పార్లమెంటు లోకి వెళ్తూ తమపై దాడి చేశారని.. ఎంపీ సారంగి ఆరోపించారు. తనపై రాహుల్ గాంధీ దాడి చేయడంతో తలకు గాయమైందన్నారు. దీంతో ఈ వ్యవహారం సంచలనం రేపింది. ఈ గొడవలో బీజేపీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగితో పాటు మరో పార్టీ ఎంపీ ముఖేష్ రాజ్‌పుత్ కూడా గాయపడ్డారు. అతడి పరిస్థితి విషమంగా ఉ ండడంతో ఆర్ఎంఎల్ ఆస్పత్రిలోని ఐసీయూలో ఉంచారు.కాగా, ఈ ఘటనపై ఖీఓఠ ఓూ డాక్టర్ అజయ్ శుక్లా స్పందించారు ఇద్దరు ఎంపీలను ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్ ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మరిన్ని వైద్య పరీక్షలు చేయనున్నారు. ఇద్దరి తలకు గాయాలు కావడంతో ఐసీయూలో చేర్పించి చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రతాప్ సారంగికి గట్టి దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావం అయిందని వైద్యులు తెలిపారు. అందుకే కుట్లు వేయాల్సి వచ్చింది. ముఖేష్ రాజ్‌పుత్ స్పృహ కోల్పోయారు. కానీ ఇప్పుడు అతను స్పృహలో ఉ న్నాడు. అయితే రక్తపోటు పెరిగింది. దీంతో ఆయనకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ అజయ్ శుక్లా తెలిపారు.మరోవైపు, ఈ ఘటనను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తీవ్రంగా ఖండించారు. ప్రతాప్ చంద్ర సారంగిని చూస్తే హృదయం చలించిపోయిందన్నారు. పార్లమెంటు చరిత్రలో ఇదో చీకటి రోజు. పార్లమెంటు గౌరవాన్ని తుంగలో తొక్కారన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న గూండాయిజానికి మరో ఉదాహరణ అని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఇటువంటి ప్రవర్తన భారతదేశ సాంస్కృతిక చరిత్రలో ఇప్పటి వరకు కనిపించలేదన్నారు. ఇలాంటి వారికి ప్రజాస్వామ్యంలో ఎలా ప్రవర్తించాలో శిక్షణ అవసరమని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

# వ్యాపార విస్తరణ, లాభార్జనపై మహిళలకు అవగాహన కల్పించాలి...

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**- సంక్రాంతి కంటే ముందు మహిళలకు వ్యాపార నైపుణ్యంపై 2 రోజులు వర్క్ షాప్ నిర్వహించాలి**

**- మహిళా మార్ట్, మహిళ శక్తి అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**




ఖమ్మం: వ్యాపార విస్తరణ, లాభార్జనపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా మార్ట్, ఇందిరా మహిళ శక్తి అమలుపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుంటూ స్వశక్తి మహిళా సంఘాలు తయారు చేసే సామాగ్రిలను అమ్మేందుకు మహిళా మార్ట్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని, స్వశక్తి మహిళా సంఘాలు తయారు చేసే ప్రొడక్ట్ ప్యాకింగ్, వాటికి బ్రాండింగ్ కల్పించడంపై దృష్టి సారించాలని అన్నారు.

మహిళా మార్ట్ లో విక్రయించే సామాగ్రి నాణ్యతతో ఉండాలని కలెక్టర్ తెలిపారు. వివిధ స్వశక్తి సంఘాల మహిళలు తయారు చేసే వస్తువులు విక్రయించే విధంగా మహిళా మార్ట్ తయారు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా బ్రాండింగ్ వచ్చేలా లోగో, స్టిక్కరింగ్ డిజైన్ తయారు చేయాలని, మహిళా మార్ట్ ప్రత్యేకంగా తెలిసే విధంగా భవనానికి పెయింటింగ్స్ వేయించాలని అన్నారు.ఇందిరా మహిళా శక్తి క్రింద మండలాల్లో వ్యాపారాలు నిర్వహించే మహిళా సంఘాలకు వ్యాపార విస్తరణ, లాభార్జనపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సంక్రాంతి కంటే ముందు మన జిల్లా కలెక్టరేట్ లో నూతనంగా యూనిట్లు ఏర్పాటు చేసిన 300 మహిళలకు అకౌంటింగ్ , వ్యాపార నైపుణ్యాలపై రెండు రోజుల పాటు అవగాహన కల్పించాలని అన్నారు. మహిళా శక్తి యూనిట్ లో గ్రౌండింగ్ తో పాటు అవి విజయవంతంగా నడిచేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని, దీని కోసం మహిళలకు వ్యాపార దృక్పథం, అధికంగా లాభాలు ఎక్కడి నుంచి రాబట్టాలనే ఆలోచనా సరళి వచ్చే విధంగా వర్క్ షాప్ వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు.వ్యాపారాలు చేసే సమయంలో ఎటువంటి అనుమతులు తీసుకోవాలి, పన్నులు ఎలా చెల్లించాలి మొదలు అంశాలు కూడా మహిళలకు వివరించాలని అన్నారు. తక్కువ రిస్క్ తో వ్యాపారాలు ఎలా చేయాలి వంటి అంశాలు మహిళలకు తెలియజేయాలని అన్నారు. మండలాల్లో బాగా నడవని యూనిట్లను గుర్తించి వాటిని బాగు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి, ఇలాంటి అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. గ్రామ స్వభావం ఏంటి, ఎటువంటి సామాగ్రి కొంటారు వంటివి ఆలోచించి వ్యాపారం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి. ఓ. సన్యాసయ్య, ఇంచార్జ్ ఎస్సీ కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. నూరుద్దీన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ మహిళా శక్తి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.వసీమ్**

**- మైనారిటీలు కుట్టు మిషన్ల**

**- దరఖాస్తు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం.**

**-ఆన్ లైన్ గడువు ఈ నెల 31 వరకు.**

జగిత్యాల: తెలంగాణ రాష్ట్రం లోని మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం ప్రవేశ పెట్టిందని,దానిలో భాగంగా రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్లను జిల్లాలోని మైనార్టీ మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ఆన్ లైన్ గడువు ఈ నెల 31 వరకు చివరి తేదీ అని మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.వసీమ్ కొరారు. ఈ పథకానికి ధరఖాస్తు చేసుకోవాలంటే 18- 55 సంవత్సరాల వయస్సు కలిగి, ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి కార్డుతో పాటు కనీస విద్యార్హత 5వ తరగతి కలిగి ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలని, ఇవి రెండూ లేని వారు గ్రామీణ ప్రాంతాలలోని వారైతే రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షల లోపు ఆదాయ ధృవీకరణ పత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి పొంది ఉండాలన్నారు. అదే విధంగా గుర్తింపు పొందిన శిక్షణా సంస్థలు, లేదా తెలంగాణ మైనారిటి ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా టైలరింగ్ కోర్సులో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత నివ్వబడుతుందని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు తమ పాస్ పోర్టు ఫోటోతో డిసెంబర్ 31 లోపు బిఐనీఎఎఎబ.ఇఐఐ.ఐనీల.తిని అనే వెబ్సైట్ లో తమ వివరాలను ఏదైనా నెట్ సెంటర్ లేదా ఎండ్రైడ్ మొబైల్ లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్ లైన్ ప్రక్రియ అనంతరం హార్డ్ కాపీలను డౌన్లోడ్ చేసుకొని సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరచి నవ భారత్ ఏరియా లోని జిల్లా కలెక్టరేట్ నందు గల మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం లో అందించాలన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేద మైనార్టీ మహిళలకు, విడాకులు పొందిన వారికి, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాధలకు తొలి ప్రాధాన్యత కల్పించ బడుతుందన్నారు

# ఇందిరమ్మ ఇళ్లు యాప్ నుంచే సేవలు

హైదరాబాద్: సాంకేతిక రంగం విపరీతంగా పెరిగిపోయింది. చదువుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. ఇక 5ఉ కూడా అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వాలు, ఆయా ఉద్యోగ సంస్థలు వారి వారి పనులను యాప్ ల ద్వారా చేయించుకుంటున్నాయి. ఒక మార్కెటింగ్ ఉద్యోగి ఒక ఊరికి వెళ్లి అక్కడి నుంచి ఒక పావలా పోస్ట్ కార్డుపై కంపెనీ అడ్రస్ రాసి పోస్ట్ చేస్తేనే సదరు ఉద్యోగి మార్కెటింగ్ కోసం ఆ ఊరికి వెళ్లేవాడని కంపెనీ నమ్మేది. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. సదరు ఊరికి వెళ్లి ఆ షాపు వారి ఫొటో కొట్టి అప్ లోడ్ చేస్తున్నారు. ఇలా చాలా విషయాల్లో మార్పులైతే జరిగాయి. సాంకేతికత పెరగడంతో పనుల్లో కూడా వేగం పెరిగింది. మనిషి ఈ జమానాలో స్వయంగా చేయాల్సిన పని స్విచ్ లను నొక్కడమే. ఈ సాంకేతికతను ప్రైవేట్ సంస్థలు, పెద్ద పెద్ద ఆర్గనైజేషన్స్ మాత్రమే వాడుతుండేవి. కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా?లు వీటినే ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. చాలా కార్యక్రమాలకు సపరేట్ గా యాప్ లను తయారు చేసి వాటి నుంచి వివరాలు నమోదు చేసి చెక్ చేస్తున్నారు.ఇటీవల ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇండ్లు' అనే యాప్ ను తయారు చేసింది. గతంలో 'ప్రజా పాలన'లో తీసుకున్న అర్జీలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ యాప్ ను ఉపయోగిస్తున్నారు. ప్రజా పాలనలో తీసుకున్న అర్జీల్లో ఇండ్లు లేని వారి వివరాలను పరిశీలించి వారికి ఒక రోజు ముందు ఫోన్ చేసి రోజు తర్వాత వచ్చి ఇందిరమ్మ ఇండ్లు యాప్ లో వివరాలు నమోదు చేసుకుంటారు. ఈ యాప్ నుంచి తీసుకున్న వివరాలు నేరుగా ప్రభుత్వానికి వెళ్తాయి. అక్కడి పెద్దలు పరిశీలించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారుఇలా చాలా విషయాలకు ప్రభుత్వాలు సొంతంగా యాప్ లు తయారు చేస్తున్నాయి. ఇలానే తెలంగాణ ప్రభుత్వం ఒక యాప్ ను తీసుకురాబోతోంది. ఈ యాప్ ద్వారా ప్రభుత్వానికి సంబంధించి చాలా పనులు వేగంగా పూర్తవుతాయి. అంటే మీరు ఏదైనా ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే సమీపంలోని కార్యాలయం వెళ్లి చేసుకోవాలి. గంటల గంటల సమయం వృథా.. పనులు కూడా వేగంగా కావడం లేదు. దీంతో ప్రభుత్వం ఒక యాప్ ను తీసుకువస్తుంది.అయితే ఈ యాప్ ను పంచాయతీ పరిధిలో వినియోగించనున్నారు. జనన, వివాహ, మరణ, ఇంటి నిర్మాణ అనుమతి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఇలా చాలా పథకాలు, సర్టిఫికెట్లు మొత్తం 20 రకాలకు సంబంధించి ఈ యాప్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. దీని పేరు 'మై-పంచాయతీ' అని పెట్టబోతోందట. వీటితో పాటు గ్రామ సమస్యలపై కూడా ఇందులో ఫిర్యాదు చేయవచ్చుట. ఇది వస్తే ప్రభుత్వం, వినియోగదారులపై భారం తగ్గుతుందని చర్చ జరుగుతోంది.

# మంచుదెబ్బకు మామిడి పూత ఎఫెక్ట్

నిజామాబాద్: రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రతలతో మామిడి పూత కోతకు గురవుతుంది. దేశంలోని మామిడి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మంచు ప్రభావం రైతులపై పడుతోంది. ప్రస్తుతం మామిడి తోటలను మంచు దుప్పటి కప్పేస్తోంది. రాత్రి వేళల్లో కురుస్తున్న మంచుతో మామిడి పూతపై తీవ్ర ప్రభావం చూపుతోంది.రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో మామిడి పంట సాగు అవుతోంది. సాగు విస్తీర్ణంలోనూ, దిగుబడిలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుంది. ఏపీ తరువాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, బీహార్, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ప్రతి ఏటా మారుతున్న పరిస్థితులతో పాటు వాతావరణ అననుకూలత కారణంగా దిగుబడి తగ్గుతోంది. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశ మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 16.07 శాతం ఉత్పత్తి అవుతోంది. తెలంగాణ నుంచి కేవలం 8.54 శాతం మామిడి ఉత్పత్తే వస్తోంది. అదే ఉత్తరప్రదేశ్‌లో అయితే 23.06 శాతం మామిడి ఉత్పత్తి వస్తోంది.ఏపీ ఉద్యానశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4.03 లక్షల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. దాని నుంచి 59.06 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి జరుగుతోంది. రాష్ట్రంలో ఉద్యానవనం పరిధిలో వచ్చే అరటి తరువాత అత్యధిక దిగుబడి వచ్చే పంట మామిడే నిలిచింది. ఇటీవలి రాష్ట్ర ప్రభుత్వం మామిడి పంటకు కూడా బీమా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బీమా వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. 2024-25, 2025-26 సంవత్సరాల్లో పునర్వ్యవస్థీకరణ తర్వాత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) అమలుకు ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది. ఖరీఫ్ సీజన్‌లో ఏడు పంటలు, రబీ సీజన్‌లో రెండు పంటలను ఈ బీమా కవర్ చేస్తుంది. రబీ సీజన్‌లో మామిడిని అదనపు పంటగా చేర్చడానికి పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మామిడి పంటకు పథకం అమలుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నిర్దేశించిన విధానం ప్రకారం పూర్తి చేయాలని సూచించింది.అయితే సాధారణంగా రెండు విడతల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబర్, జనవరి మధ్య పూత వచ్చి ఆ తరువాత పిందెలు రావాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎక్కడా పూత కనిపించడం లేదు. మొక్క తోటల్లో మాత్రమే అక్కడక్కడ పూత కనిపిస్తోంది. ఇది ఒకటి నుంచి రెండు శాతం కంటే ఎక్కువ ఉండదని రైతులు చెబుతున్నారు. మొదటి విడతలో పూత కనిపించకపోయినా వాతావరణంలో వచ్చే మార్పుతో రెండో విడతలో పూత విచ్చుకునే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు తెలుపుతున్నారు. చీడపీడలను నివారించి, మేలైన యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యతగల మంచి దిగుబడి అభిస్తాయని ఉద్యానవన యూనివర్సిటీ అధ్యపకులు తెలిపారు.రాష్ట్రంలో ప్రధానంగా బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, తోతపూడి (కలెక్టర్), పందూరి మామిడి, ముంతమామిడి తదితర రకాల మామిడి పంట రైతులు పండిస్తున్నారు. కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి పండ్లుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తోతపూడి రకం మామిడ పండ్లను జ్యూస్ తయారు చేసే కార్పొరేట్ కంపెనీలు సేకరిస్తుంటాయి. మామిడి తాండ్ర తయారీలోనూ కూడా అధికంగా వినియోగిస్తారు. ఇప్పటికే రైతులు చీడల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొంత మంది చిన్న, సన్నకారు మామిడి రైతులు గిట్టుబాటు రాక తోటలను ఎకరా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు కౌలుకు ఇచ్చేస్తున్నారు. పూత కోత, చీడల నివారణకు ఉద్యానవన అధికారులను సంప్రదించి, వారు చెప్పిన పురుగు మందులను వాడాల్సి ఉంటుంది. అప్పుడే పూత కోత నివారణను, చీడల నివారణను అరికట్టగలుగుతారు.

# సిరిసిల్లలో పోలీస్ అక్కలు

కరీంనగర్: సిరిసిల్ల జిల్లా పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలికలు, మహిళల భద్రత కోసం 'పోలీస్ అక్క' వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా "పోలీస్ అక్క" పేరుతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ను ఎంపిక చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటించారు. వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళల రక్షణ కోసం 'పోలీసు అక్క' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. షీ టీమ్ కు అదనంగా ప్రతి పోలీస్ స్టేషన్ కు "పోలీస్ అక్క" పేరుతో మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేశారు. వారు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, మహిళ చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. సిరిసిల్లలో షీ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన "పోలీస్ అక్కా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. జిల్లాలో మహిళా రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళ రక్షణయే దెయ్యంగా షీ టీమ్ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే "పోలీస్ అక్క" పేరుతో జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. పోలీస్ అక్కగా ఎంపిక కాబడిన వారు షీ టీమ్ కి సహాయకంగా ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు పోక్సో యాక్ట్, సెక్సువల్ హార్స్మెంట్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందని తెలిపారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారు సంప్రదించే విధంగా షీ టీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లు ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్పీ మహాజన్ సూచించారు. సోషల్ మీడియాలో వేదికగా విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మహిళలు,విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఆటకట్టిస్తున్న షీ టీమ్?

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్ సత్ఫలితాలు ఇస్తుందని ఎస్పీ తెలిపారు. విద్యార్థుల మహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఈ సంవత్సరం 52 మంది ఆకతాయిలను రెండ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిపై 60 పెట్టి కేసులు, 44 ఈఎఫ్ లు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

×పిఎస్ ల వారిగా పోలీస్ అక్కలు...

సిరిసిల్ల టౌన్ – సరస్వతీ
తంగలపల్లి – సుజాత
మస్తాబాద – మంజుల
ఎల్లతకుంట –ప్రవలిక
ఎల్లారెడ్డిపేట – రోజా
గంభీరరావుపేట. శిరీష
వీరన్నపల్లి– స్వప్న.
వేములవాడ టౌన్ లత
వేములవాడ రూరల్ – రేణుకా
బోయినపల్లి. పినాకల్ యాదవ్
చందోర్తి . శ్రీవెన్నెల
కోనారావుపేట– సంధ్య
రుద్రాంగి. జి అమల

# జీమెయిల్, వాట్సప్ లకు మస్క్ చెక్...

న్యూయార్క్: ఎలాన్ మస్క్ హ్యాండ్ పడితే అది తిరుగులేని విజయం సాధిచడం ఖాయం. టెస్లా దగ్గర నుంచి స్పేస్ ఎక్స్ వరకూ ఆయన చేపట్టిన ప్రాజెక్టులు బంపర్ హిట్లు అయ్యాయి. ప్రపంచంలో అత్యధిక ధనవంతుడిగా నిలిచారు. ట్విట్టర్ కొన్నప్పుడు ఆయన ఆస్తిలో సగం అయిపోయిందని అనుకున్నారు. కానీ రెట్టింపు అయింది. మొన్నటి దాకా ఆయన అమెరికా అధ్యక్ష ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఎలాన్ మస్క్ కు ట్రంప్ కొత్త పదవి ఇచ్చారు. అది పూర్తి స్థాయి పదవి కాదు. తన వ్యాపారాలు తాను చేసుకుంటూ డోగే అనే వ్యవస్థను నడపాల్సి ఉంటుంది. ఆయనకు రకరకాల సలహాలను సోషల్ మీడియాలో ఇస్తూంటారు నెటిజన్లు. తాజాగా ఆయనకు ..ఎలాన్ మస్క్ ఈమెయిల్ సర్వీస్ ను ప్రారంభిస్తే తాము జీమెయిల్ ను డంప్ చేస్తామని ఓ నెటిజన్ ఆఫర్ ఇచ్చారు. అది చూసిన మస్క్.. భిన్నంగా స్పందించారు. మెసెజింగ్ మీదనే మొత్తం థింక్ చేయాల్సి ఉందని అందులో ఈమెయిల్‌తో పాటు అన్ని మెసెజింగ్ వ్యవస్థలపైనా చర్చించాల్సి ఉందని చెప్పుకొచ్చారు.తర్వాత మరో నెటిజన్ ఎక్స్ మెయిల్ క్రియేట్ చేసి చూపించారు. అవును.. తర్వాత చేయాల్సిన పని ఇదేనని సమాధానం ఇచ్చాడు. ఆ తర్వాత చాలా మంది చాలా వాటిపై సలహాలు ఇచ్చారు. ఒకరు యూట్యూబ్ సంగతి కూడా చూడాలన్నారు. ఎలాన్ మస్క్ రిప్లయ్స్ చూస్తే ఆయన త్వరలో జీ మెయిల్ కు చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కమలానికి కొత్త ఏడాది కొత్త అధ్యక్షుడు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్నాయి. పాత, కొత్త నేతల పంచాయతీలతో రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లిందంట. తాము అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరమని భావిస్తున్న పార్టీ పెద్దలు.. ఆ దిశగా కొత్త అధ్యక్షుడికి బాధ్యతలు కట్టబెట్టాలని భావిస్తున్నారంట.అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే ఢిల్లీ పెద్దలు పట్టం కట్టబోతోతున్నారంట.. పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి. మరోవైపు సంస్థాగత ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేసింది. గత నెల 25 నుంచి ఈ ప్రక్రియను మొదలు పెట్టింది. కాగా ఈనెల 15 లోపు బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. అందుకు పార్టీ హైకమాండ్ ఇప్పటికే దిశా నిర్దేశం చేసింది. 15 నుంచి 20 వరకు మండల కమిటీలు కంప్లీట్ చేయాలని చూస్తోంది. ఈ ప్రక్రియ అనంతరం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు వెళ్లేందుకు నాయకత్వం సిద్ధం అవుతోంది. ఇప్పటికే పార్టీ బూత్ ల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. గ్రౌండ్ నుంచి పార్టీని స్ట్రాంగ్ చేయదాంతో పాటు,. సంస్థాగత ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాలు, యాక్టివ్ మెంబర్ షిప్ అంశాలపైనా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.ఇక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే జాతీయ, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, జిల్లాల వారీగా ఇంచార్జీలను హైకమాండ్ నియమించింది. జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ను, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణ ను నియమించింది. వారు ఇప్పటికే సంస్థాగతంగా ఎన్నికలకు కసరత్తు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో నెలకొంది. స్టేట్ ప్రెసిడెంట్ కోసం చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. ఎంపీల్లో రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, డీకే అరుణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యేల్లో రాజాసింగ్, పాయల్ శంకర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే కొంత మంది నేతలు పార్టీ హైకమాండ్ ఆశీస్సులు పొందాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది.అయితే పార్టీ అధ్యక్షుడు ఎవరనే దానిపై అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. హైకమాండ్ నిర్ణయానికి అనుగుణంగానే సంస్థాగత ఎన్నికలు జరిగుతున్నాయనే చర్చ ఆ పార్టీలో జరుగు తోంది. పార్టీ డిసైడ్ చేసిన నేతకే మద్దతు తెలిపి లాంఛనంగా ఎన్నుకుంటారనే టాక్ సైతం వినిపిస్తోంది. అధ్యక్షుడు ఎవరనే నిర్ణయం జరిగిపోవడంతో.. ఇక ఆ పేరు చుట్టూనే ఎన్నిక హడావుడి కొనసాగనుంది. అభ్యర్థి ఈటల రాజేందరే అంటున్నారు.అయితే పార్టీ డిసైడ్ చేసింది ఎవరిని అనేది కాషాయశ్రేణుల్లో సస్పెన్స్‌గా మారిందంట.

# సమ్మెలో టీచర్లు చదువుకు దూరంగా విద్యార్థినులు..!

సిద్దిపేట: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 22 కస్తూర్బా పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కస్తూర్బా పాఠశాల ల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బాపాఠశాలల ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సత్వరమే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఉపాధ్యాయు లు కోరుతున్నారు. తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయులు సమ్మెలో ఉండగా పాఠాలు చెప్పే వారు లేక విద్యార్థినులు ఆట,పాటలతో గడుపుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు రక్షణగా ఉపాధ్యాయులు లేక విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లాలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ నెల మొదటి వారంలో సంబంధిత అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. జిల్లాలో 22 కస్తూర్బా, ఏడు కస్తూర్బా జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 22కస్తూర్బా పాఠశాలల్లో 4500, ఏడు జూనియర్ కళాశాలల్లో సుమారు 2500మంది విద్యార్థినులు ఉన్నారు. కస్తూర్బా పాఠశాలలో 310 మంది వర కు ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో 140 మంది పీజీసీఆర్టీ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరి సమ్మెకు రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంఘీభావం ప్రకటించారు.

**చదువులకు దూరంగా విద్యార్థినులు**

కస్తూర్బా పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేక విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతూ గడుపుతున్నారు. అసలే బాలికల విద్యాలయాలు ఉపాధ్యాయులు లేక వారి కి రక్షణ లేకుండా పోయింది. ఉపాధ్యాయుల సమ్మెతో మండల కేంద్రాలకు దూరంగా ఉన్న కస్తూర్బా పాఠశాలల పరిస్థితి దారుణంగా మారింది. టెన్త్ విద్యార్థినులకు డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాల్సి ఉండగా పాఠాలు పూర్తికాక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకటించడంతో పాఠా లు పూర్తికాక ఎలా చదువుకోవాలో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

# క్యాన్సర్ కు వ్యాక్సిన్...

మాస్కో: మారుతున్న జీవన శైలి.. ఉరుకుల పరుగుల జీవితం.. ఆహారంలో మార్పుల కారణంగా వ్యాధులు మనల్ని చుట్టుముడుతున్నాయి. కొత్త కొత్త వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతోపాటు క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది.

ఒకప్పుడు ఇంటి పంట.. ఇంట్లో వండిన వంటను మాత్రమే తినేవారు. రసాయనాలు లేని పంటలు పండించేవారు. ఎలాంటి విషతుల్యం కాని పాలు తాగేవారు. నిల్వ చేయని మాంసం తినేవారు. దీంతో అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు తక్కువగా వచ్చేవి. కానీ, మారుతున్న కాలంతో జీవన శైలిలోనూ మార్పులు వస్తున్నాయి. వ్యవసాయంలో రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగింది. పాలను రసాయనాలతో నిల్వ చేస్తున్నారు. వాటినే మనం తాగుతున్నాం. ఇక మాసం కూడా ఫ్రీజ్ చేసి అమ్ముతున్నారు. ఇలా అన్ని ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి. దీంతో దీర్ఘకాలిక వ్యాధులు మనల్ని చుట్టుముడుతున్నాయి. ఇందులో క్యాన్సర్ ఒకటి. ఇటీవలి కాలంలో క్యాన్సర్ వాధితులు గణనీయంగా పెరుగుతున్నారు. వ్యాధికి అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినా.. చాలా మంది వ్యాధితో మృతిచెందుతున్నారు. ఇందుకు కారణం.. వ్యాధిని తొలి దశలోనే గుర్తించకపోవడం. ఈ తరుణంలో వైద్యరంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఇందుకు రష్యా కేంద్రంగా మారింది. క్యాన్సర్‌ను నయం చేసే వ్యాక్సిన్‌ను రూపొందించింది. అంతేకాదు.. దీనిని దేశంలోని రోగులకు ఉచితంగా అందిస్తామని ప్రకటించింది. ఎంఆర్ఎన్ఏ ఆధారితంగా రూపొందించిన ఈ వ్యాక్సిన్‌ను వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామని రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తరఫున రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ జనరల్ డైరెక్టర్ అండ్రే కప్రిన్ ప్రకటించారు.కరోనా నుంచి రక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొన్ని టీకాలు మెసెంజర్ ఆర్ఎన్ఏ(ఎంఆర్ఎన్ఏ) పోగుల ఆధారంగా పనిచేస్తాయి. అవి కరోనా వైరస్‌ను గుర్తించేలా మానవ రోగ నిరోధక వ్యవస్థకు శిక్షణ ఇస్తాయి. అలాగే రష్యా తయారు చేసిన క్యాన్సర్ వ్యాక్సిన్ కూడా ఇదే తరహాలో పనిచేస్తుంది. ఆర్ఎన్ఏ(రిబో న్యూక్లియర్) అనేది ఒక పాలిమెరిక్ అణువు. ఇది జీవ కణజాలంలో చాలా జీవ సంబంధమైన విధులకు అవసరం. మెసెంజర్ ఆర్ఎన్ఏ పీస్‌ను వ్యాక్సిన్ ద్వారా శరీరంలోకి ప్రవేశపెడతారు. తద్వారా కణాను ఒక నిర్దిష్టమైన ప్రొటీన్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రేరేపిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ ఈ ప్రొటీన్‌ను గుర్తిస్తుంది. దానితో పోరాడడానికి ప్రతినిరోధకాలను ఉత్పత్తి చేస్తుంది. అంటే క్యాన్సర్ కణాలను గుర్తించి దాడిచేస్తుంది.వ్యాక్సిన్ తయారీలో ఏఐ పాత్ర కూడా ఉంది. పర్సనలైజ్డ్ వ్యాక్సిన్లను రూపొందించడానికి ఏఐ ఆధారిత న్యూరల్ నెట్వర్క్ గణనలు అవసరమైన సమయాన్ని తగ్గించలవని, ఈ ప్రక్రియ కేవలం గంటలోపే పూర్తి చేయగలదని ప్రకటించారు.

# రైతులు కొయ్య కాళ్ళను కాల్చవద్దు..

**– వరి కొయ్యకాలు కాల్చకుండా రోటరీ మల్చర్ వడకంపై క్షేత్ర ప్రదర్శన**



జమ్మికుంట: వరి కొయ్య కాళ్ళను కాల్చవద్దని హుజురాబాద్ ఏ డి ఏ జి .సునీత అన్నారు. గురువారంజమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ గ్రామం యందు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యం లో ఏ డి ఏ హుజురాబాద్ జి సునీత రోటరీ మల్చర్ వడకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, పంటకు పంటకు మధ్య సమయం తక్కువగా ఉండటంతో వరి కోసిన తర్వాత మిగిలిపోయిన కొయ్య కాళ్ళు కాల్చడం సరి కాదన్నారు. వరిగడ్డిని కంపోస్ట్ గా మార్చుకోవడం పై రైతులకు అవగాహన లేకపోవడంతో పాటు వీటిని కాల్చడం వలన పొలంలో ఉన్న కీటకాలను వ్యాధికారక జీవులను నశింపజేయవచ్చు అనే అపోహలో చాలామంది రైతులు వరి కోయలను గడ్డిని తగలబెడుతున్నారు అని తెలిపారు. ఇలా తగలబెట్టడం వలన జరిగే నష్టాలను అధిగమించడానికి కంపోస్ట్ గా కానీ లేదా రోటరీ మల్చర్ ద్వారా గాని నేలలో కలియదున్ని ,ఒక ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేయడం వలన జరిగే లాభాలను గురించి ఆమె వివరించారు.

# పృథ్వీ షా.. ప్రాక్టీస్‌కు రాకుండా లేట్ నైట్ పార్టీలకు వెళ్లేవాడు!



టీమిండియా యువ ఓపెనర్ పృథ్వీ షా వ్యవహారశైలిపై ముంబై క్రికెట్ అసోసియేషన్ ఘాటుగా స్పందించింది. అతని ఫిట్‌నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన బాగా లేకపోవడంతోనే విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లకు ఎంపిక చేయలేదని స్పష్టం చేసింది.

పృథ్వీ షా ప్రాక్టీస్‌కు రాకుండా లేట్ నైట్ పార్టీలకు వెళ్లేవాడని పేర్కొంది. ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పృథ్వీ షా జట్టులో ఉన్న పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందని ఎంసీఏకు చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపారు. 'సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పృథ్వీ షా సరిగ్గా ప్రాక్టీస్‌కు వచ్చేవాడు కాదు. అర్ధరాత్రి హెూటల్ బయటకు వెళ్లి ఉదయం 6 గంటలకు తిరిగి వచ్చేవాడు. అతని కారణంగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై 10 మంది ఫీల్డర్లతోనే ఆడాల్సి వచ్చింది. అతను మైదానంలో ఉన్నా లేనట్లే.

బంతి అతని పక్కనుంచి వెళ్లినా దాన్ని పట్టుకోలేడు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా సరైన సమయంలో బంతిని హిట్ చేయడంలో తడబడటం చూశాం. అతని ఫిట్‌నెస్ ఏ మాత్రం బాలేదు. క్రమశిక్షణ, ప్రవర్తన కూడా సరిగ్గా లేదు. ఈ విషయంపై చాలా సార్లు అతనికి చెప్పి చూశాం. మేం ఎవర్నీ లాలించి ఆడించలేం.

పృథ్వీ షాకు శత్రువులెవరూ లేరు. తనకి తానే శత్రువు. జట్టులోని సీనియర్లు కూడా ఇప్పుడు అతని వైఖరిపై ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్ట్‌లు పెడితే ముంబై సెలెక్టర్లు, ఎంసీఏపై ప్రభావం చూపిస్తాయని అనుకోవడం తప్పు. పృథ్వీ షా ఫిట్‌నెస్ మెరుగుపర్చుకోవడంపై ఫోకస్ పెడుతాడని ఆశిస్తున్నాం. అతని ప్రతిభ గురించి అందరికి తెలిసిందే. పృథ్వీ షా చేసే హార్డ్ వర్క్‌పై అతని పునరాగమనం ఆధారపడి ఉంది. 'అని ఎంసీఏ అధికారి తెలిపారు.

నేనింకేం చేయాలి..?

విజయ్ హజారే ట్రోఫీకి తనను ఎంపిక చేయకపోవడంపై పృథ్వీ షా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. తాను ఇంకేం చేయాలని ఆవేదన వ్యక్తం చేశాడు. దేవుడా చెప్పు.. నేను ఇంకేం చేయాలి. 65 ఇన్నింగ్స్‌లు.. 3399 పరుగులు.. 55.7 సగటు.. స్ట్రైక్‌రేట్ 126 నమోదు చేసినా.. నా ఎంపికకు ఇవి సరిపోలేదు. అయినా నీ(దేవుడి)పై నా నమ్మకం సడలదు. ప్రజలు కూడా నన్ను విశ్వసిస్తారని ఆశిస్తున్నా. ఎందుకంటే నేను ఖచ్చితంగా పునరాగమనం చేస్తాను. ఓం సాయిరామ్' అని ఇన్‌స్టా స్టోరీలో పృథ్వీ షా పేర్కొన్నాడు.

# కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ.. ఆర్‌సీబీ తుది జట్టు ఇదే!



గత 17 ఏళ్లుగా అందని ద్రాక్షగా ఉన్న ఐపీఎల్ టైటిల్‌ను ఈసారైనా అందుకోవాలనే లక్ష్యంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వ్యూహాలు రచిస్తోంది. ముందుగా జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసిన ఆర్‌సీబీ..

ఐపీఎల్ 2025 మెగా వేలంలో కావాల్సిన ఆటగాళ్లనే కొనుగోలు చేసింది. ముఖ్యంగా ఆర్‌సీబీ హెూమ్ గ్రౌండ్ చిన్నస్వామి స్టేడియాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఆటగాళ్లను ఎంపిక చేసుకుంది.

ముఖ్యంగా గత కొన్నేళ్లుగా వేధిస్తున్న బౌలింగ్ బలహీనతను అధిగమించింది. అనుభవం కలిగిన జోష్ హజెల్ వుడ్, భువనేశ్వర్ కుమార్‌లను తీసుకొని బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసింది. పేపర్‌పై ఆర్‌సీబీ జట్టు బలంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌తో సమతూకంగా కనిపిస్తోంది. మెగా వేలంలో మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్ కోసం ఆర్‌సీబీ ప్రయత్నించినా.. తీసుకోలేకపోయింది. కానీ సీనియర్ స్పిన్నర్ అయిన కృనాల్ పాండ్యా, యువ ప్లేయర్ సుయాష్ శర్మలను కొనుగోలు చేసింది.

ఆర్‌సీబీ సారథ్య బాధ్యతలను తిరిగి విరాట్ కోహ్లీ చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌తో కలిసి విరాట్ కోహ్లీ ఓపెనింగ్ చేయనున్నాడు. ఈ ఇంగ్లండ్ ఓపెనర్ కేకేఆర్ తరపున గత సీజన్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఆ జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లోనూ ఫిల్ సాల్ట్ అదే తరహా ప్రదర్శనను పునరావృతం చేస్తాడని ఆర్‌సీబీ భావిస్తోంది. మూడో స్థానంలో రజత్ పటీదార్ బరిలోకి దిగనున్నాడు. గత సీజన్లలో నిలకడగా రాణించడంతో ఆర్‌సీబీ అతన్ని రిటైన్ చేసుకుంది. నాలుగో స్థానంలో ఇంగ్లండ్ విధ్వంసకర బ్యాటర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఆడనున్నాడు. అతను నిలకడగా రాణించకపోయినా.. తనదైన రోజు మ్యాచ్ విన్నింగ్ పెర్ఫామెన్స్ చేస్తాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ జితేశ్ శర్మ ఆడనున్నాడు.

గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున జితేశ్ శర్మ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆరో స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ టీమ్ డేవిడ్ ఆడనుండగా.. కృనాల్ పాండ్యా ఏడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. ఏడో స్థానం వరకు బ్యాటింగ్ డెప్త్ ఉండటం ఆర్‌సీబీకి కలిసొచ్చే అంశం. జోష్ హజెల్ వుడ్, యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్ పేస్ బాధ్యతలు పంచుకోనుండగా.. సుయాశ్ శర్మ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా బరిలోకి దిగనున్నాడు. దేవదత్ పడిక్కల్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడనున్నాడు.

ఆర్‌సీబీ తుది జట్టు(అంచనా): విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, రజత్ పటీదార్, లియామ్ లివింగ్ స్టోన్, జితేశ్ శర్మ, టీమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, జోష్ హజెల్ వుడ్, యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, దేవదత్ పడిక్కల్(ఇంపాక్ట్).

# చరిత్ర సృష్టించిన పాకిస్థాన్.. తొలి జట్టుగా వరల్డ్ రికార్డ్!



అంతర్జాతీయ వన్డేల్లో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ చరిత్ర సృష్టించింది. 21వ శతాబ్దంలో సౌతాఫ్రికా గడ్డపై వరుసగా మూడు వన్డేల సిరీస్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా రికార్డ్ సాధించింది.

సౌతాఫ్రికాతో గురువారం జరిగిన రెండో వన్డేలో 81 పరుగుల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది.

సఫారీ గడ్డపై పాకిస్థాన్‌కు ఇది వరుసగా మూడో వన్డే సిరీస్ విజయం. ఆ జట్టు 2013, 2021లో సిరీస్‌లను కైవసం చేసుకుంది. 7 పర్యటనలో పాకిస్థాన్ మూడు సార్లు వన్డే సిరీస్ గెలిచింది. పాకిస్థాన్ తర్వాత ఆస్ట్రేలియా 10 పర్యటనల్లో మూడు సార్లు సౌతాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది.

వచ్చే ఏడాది సొంతగడ్డపై జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు ఈ సిరీస్ విజయం పాకిస్థాన్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది. హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న విషయం తెలిసిందే. భారత మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. చివరిసారిగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2017లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్‌ను ఆ జట్టు ఓడించింది.

ఈ సిరీస్ విజయంపై పాక్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'జట్టులోని ప్రతీ ఒక్కరు రాణించారు. శుభారంభం దక్కకున్నా మాకు మంచి భాగస్వామ్యం కూడా లభించింది. నేను, బాబర్ ఆజామ్ నెమ్మదిగా ఆడి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసాం. 300 పరుగులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ కమ్రాన్ గులామ్ సూపర్ బ్యాటింగ్‌తో 320 పరుగులు చేశాం. ఓ కెప్టెన్‌గా అతనిపై నాకు నమ్మకం ఉంది. కానీ ఈ రోజు అతను స్థాయికి తగ్గట్లు రాణించలేదు(నవ్వుతూ). బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు.'అని విజయానంతరం రిజ్వాన్ చెప్పుకొచ్చాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.5 ఓవర్లలో 329 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ రిజ్వాన్(82 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 80), బాబర్ ఆజామ్(95 బంతుల్లో 7 ఫోర్లతో 73), కమ్రాన్ గులామ్(32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీలతో రాణించారు.

సౌతాఫ్రికా బౌలర్లలో క్వేనా మఫకా(4/72) నాలుగు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్(3/71) మూడు వికెట్లు పడగొట్టాడు. ఫర్చూన్, పెహ్లుక్వాయోకు చెరో వికెట్ దక్కింది. అనంతరం సౌతాఫ్రికా 43.1 ఓవర్లలో 248 పరుగులకు కుప్పకూలింది. హెన్రీచ్ క్లాసెన్(74 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. అతనికి తోడు మరే బ్యాటర్ రాణించలేదు.

పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది(4/47) నాలుగు వికెట్లు తీయగా.. నసీమ్ షా(3/37) మూడు వికెట్లు పడగొట్టాడు. అబ్రార్ అహ్మద్(2/48)కు రెండు వికెట్లు దక్కగా..

సల్మాన్ అఘాకు ఓ వికెట్ దక్కింది. తొలి వన్డేలోనూ పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకుంది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే ఆదివారం జరగనుంది.

# అశ్విన్‌లో ఏదో అసంతృప్తి.. బీసీసీఐ తప్పు చేసింది: కపిల్ దేవ్



ఆకస్మాత్తుగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌లో ఏదో అసంతృప్తి ఉందని దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు.

ఘన వీడ్కోలుకు అశ్విన్ అర్హుడని, ఇలా ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ఊహించలేదన్నాడు. అశ్విన్‌కు వీడ్కోలు మ్యాచ్ ఏర్పాటు చేయకుండా బీసీసీఐ తప్పు చేసిందని అభిప్రాయపడ్డాడు.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్.. అశ్విన్ రిటైర్మెంట్‌పై స్పందిస్తూ అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు.


త క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన అశ్విన్ ఇలా ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం ఆశ్చర్యానికి గురి చేసింది. అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. అయితే అశ్విన్‌లో ఏదో అసంతృప్తి ఉన్నట్లు అర్థమవుతోంది. అతను సంతోషంగా లేడని, ఏదో బాధలో ఉ న్నాడనిపిస్తోంది. ఘన వీడ్కోలుకు అశ్విన్ అర్హుడు. రిటైర్మెంట్ విషయంలో అతను తొందరపడ్డాడు. ఇంకొన్ని రోజులు ఆగి భారత గడ్డపై రిటైర్మెంట్ ప్రకటించాల్సింది. కానీ అశ్విన్ ఇలా ఎందుకు చేశాడో అర్థం కావడం లేదు.

ఈ విషయంలో అశ్విన్ వర్షన్ వినాలని ఉంది. దేశం కోసం 106 టెస్ట్‌లు ఆడిన అశ్విన్‌కు గౌరవం ఇవ్వాలి. భారత క్రికెట్‌కు అతను ఎంతో చేశాడు. భారత మ్యాచ్ విన్నర్ అయిన అశ్విన్‌కు బీసీసీఐ ఘనమైన వీడ్కోలు పలకాలి. క్రికెట్‌లో ప్రయోగాలకు అశ్విన్ ఎప్పుడూ సిద్దంగా ఉండేవాడు. అతనో క్రికెట్ సైంటిస్ట్. అదే అతని సక్సెస్‌కు కారణం.

బ్యాటర్లకు ప్రశంసలకు దక్కే క్రికెట్‌లో అశ్విన్ వారికి ధీటుగా నిలబడ్డాడు. అతని దగ్గర వైవిధ్యమైన బంతులు ఉన్నాయి. ఆఫ్ స్పిన్, క్యారమ్ బాల్‌తో పాటు లెగ్ స్పిన్ కూడా వేయగలడు. అశ్విన్ ఓ ఛాంపియన్. కెప్టెన్ నమ్మే బౌలర్. నేనాడే సమయంలో అశ్విన్ ఉండి ఉంటే అతనికి జట్టులో చోటు ఇచ్చేందుకు నేను తప్పుకునేవాడిని.'అని కపిల్ దేవ్ కొనియాడాడు.

అశ్విన్ ఆకస్మిక రిటైర్మెంట్‌తో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కారణంగానే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడనే వాదన బలంగా వినిపిస్తోంది. జట్టులో ఎదురైన అవమానాలు తట్టుకోలేకే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించి ఉండొచ్చని అశ్విన్ తండ్రి ఆరోపించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

# కమిన్స్, స్టార్క్ కాదు.. అతనే వరల్డ్ బెస్ట్ బౌలర్: బ్రెట్ లీ



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాపై ఆస్ట్రేలియా దిగ్గజ బౌలర్ బ్రెట్ లీ ప్రశంసల జల్లు కురిపించాడు. బుమ్రానే వరల్డ్ బెస్ట్ పేసర్ అని కొనియాడాడు.

ఆసీస్ వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రానే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడని ప్రశంసించాడు. అతనికి దారిదాపుల్లో కూడా మరో బౌలర్ లేడని, అసాధారణ ప్రదర్శనతో ఇతర బౌలర్ల గణంకాలను బుమ్రా కనుమరుగు చేశాడని అభిప్రాయపడ్డాడు.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా నిలిచిన విషయం తెలిసిందే. ఇరు జట్లలో జస్ప్రీత్ బుమ్రానే అత్యుత్తమ బౌలింగ్ గణంకాలు నమోదు చేశాడు. మూడు టెస్ట్‌ల్లో 21 వికెట్లు పడగొట్టాడు. గబ్బా టెస్ట్‌లో 9 వికెట్లు తీసిన బుమ్రా.. బ్యాటింగ్‌లోనూ సత్తా చాటి మ్యాచ్ డ్రా అవ్వడంలో కీలక పాత్ర పోషించి భారత్‌కు ఓటమి తప్పించాడు.

తొలి టెస్ట్‌లో 8 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందుకున్న బుమ్రా.. పింక్ బాల్ టెస్ట్‌లోనూ 4 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే బుమ్రాపై బ్రెట్ లీ ప్రశంసల జల్లు కురిపించాడు. మహమ్మద్ షమీ లోటును భర్తీ చేసేందుకు మహమ్మద్ సిరాజ్ ప్రయత్నిస్తున్నాడని తెలిపాడు.

'జస్ప్రీత్ బుమ్రా వరల్డ్ క్లాస్ బౌలర్. దురదృష్టవశాత్తు టీమిండియాకు మహమ్మద్ షమీ లేడు. ఎన్ని విమర్శలు వచ్చినా షమీ స్థానాన్ని భర్తీ చేసేందుకు సిరాజ్ ప్రయత్నిస్తున్నాడు. ప్రపంచంలోనే భారత్‌కు అత్యుత్తమ బౌలింగ్ దళం ఉంది. కానీ బుమ్రా అత్యుత్తమ ప్రదర్శనతో ఇతర బౌలర్లు రాణించడం లేదని, అతనే భారత బౌలింగ్ భారాన్ని మోస్తున్నాడని జనాలు అనుకుంటున్నారు. మిగతా బౌలర్లకు అందనంత దూరంలో బుమ్రా నిలిచాడు. ఇతర బౌలర్లను కించపర్చడం నా ఉద్దేశం కాదు. కానీ బుమ్రా అత్యుత్తమం.'అని బ్రెట్ లీ చెప్పుకొచ్చాడు.

ఆస్ట్రేలియా గడ్డపై ఇప్పటి వరకు 53 వికెట్లు తీసిన బుమ్రా.. ఈ ఘనత సాధించిన తొలి భారత క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్‌ను బుమ్రా అధిగమించాడు. బుమ్రాకు అండగా రాణించడంలో సిరాజ్ తడబడుతుండగా.. ఆకాశ్ దీప్, హర్షిత్ రాణాల విషయంలో మేనేజ్‌మెంట్ అయోమయానికి గురవుతోంది. మెల్‌బోర్న్ వేదికగా డిసెంబర్ 26 నుంచి ఇరు జట్ల మధ్య నాలుగో టెస్ట్ ప్రారంభం కానుంది.

ఈ మ్యాచ్ గెలవడమే లక్ష్యంగా ఇరు జట్లు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇప్పటికే ఆసీస్ తమ జట్టులో భారీ మార్పులు చేసింది. టీమిండియా కూడా తుది జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంది.

# ఈ ఏడాది క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసిన వివాదాలు..!



నిన్న జరిగింది.. రేపు గుర్తొస్తే జ్ఞాపకం. ఈ ఏడాదంతా జరిగింది ఒక్కరోజు గుర్తుచేసుకుంటే మననం. 365 రోజులు.. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత. ఒక్కో ఘటనకు ఒక్కో విశిష్టత.

ఇందులో మంచి ఉంది.. చెడు ఉంది. ఒక్కో ఘటన ఓ గుణపాఠం. మంచి మరిచిపోయినా పర్వాలేదు కానీ చేసిన తప్పును.. దాని నుంచి నేర్చుకున్న గుణపాఠాన్ని మరవద్దు. జెంటిల్‌మెన్ గేమ్ అయిన క్రికెట్‌లోనూ వివాదాలు చోటు చేసుకున్నాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను సొంత అభిమానులే గేలి చేయగా.. కేఎల్ రాహుల్‌ను లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకా కెమెరాల ముందే మందలించాడు. ఆస్ట్రేలియా గడ్డపై సిరాజ్, ట్రావిస్ హెడ్ గొడవపడ్డారు. పాకిస్థాన్ స్టార్ పేసర్ హ్యారీస్ అభిమానులతో గొడవ పడగా.సంజయ్ మంజ్రేకర్ మహమ్మద్ షమీపై నోరు పారేసు కున్నాడు. మొత్తం 5 వివాదాలు ఈ ఏడాది క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసాయి.

1. హార్దిక్ పాండ్యాకు అవమానం..

ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించిన ఆ జట్టు మేనేజ్‌మెంట్ హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఈ నిర్ణయాన్ని తప్పుబట్టిన ఆ జట్టుకు చెందిన కొందరు అభిమానులు.. హార్దిక్ పాండ్యాను గేలి చేశారు. ఐపీఎల్ 2024 సీజన్ ముగిసే వరకు ప్రతీ మ్యాచ్‌లో అతన్ని ఇబ్బంది పెట్టారు. భారత క్రికెట్ చరిత్రలోనే సొంత ఆటగాడిని గేలి చేయడం ఇదే తొలిసారి. హార్దిక్‌ను ఎగతాళి చేయవద్దని రోహిత్ శర్మ చెప్పినా ఫ్యాన్స్ వినలేదు. కానీ భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించడంతో అతన్ని గేలి చేసిన అభిమానులే.. ప్రశంసల జల్లు కురిపించారు. కొందరు సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు కూడా చెప్పారు.

2.రాహుల్‌ను తిట్టిన సంజీవ్ గోయెంకా..

ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ చిత్తుగా ఓడటంతో ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా తీవ్రంగా హర్ట్ అయ్యాడు. టీవీ కెమెరాల ముందే లక్నో కెప్టెన్ అయిన రాహుల్‌ను తిట్టాడు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ రికార్డ్ స్కోర్ చేయడాన్ని గోయెంకా తట్టుకోలేకపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. గోయెంకాపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాడు.

ఈ ఘటనతో తీవ్రంగా హర్ట్ అయిన రాహుల్.. ఏకంగా ఆ జట్టునే వీడాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 14 కోట్లకు తీసుకుంది. తమ జట్టును వీడిన రాహుల్‌పై గోయెంకా పరోక్షంగా విమర్శలు గుప్పించాడు.

3. అభిమానులతో హ్యారీస్ రౌఫ్ గొడవ..

పాకిస్థాన్ పేసర్ హ్యారీస్ రౌఫ్ ఓ అభిమానితో గొడవపడ్డాడు. అమెరికా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. తన సతీమణితో వెళ్తుండగా ఓ అభిమాని హ్యారీస్ రౌఫ్‌ను టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని ప్రస్తావిస్తూ కామెంట్ చేశాడు. దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన హ్యారీస్ రౌఫ్ సదరు అభిమానిపైకి దూసుకొచ్చాడు. అతని సతీమణి అడ్డుకున్నా వినలేదు. 'నువ్వు భారత అభిమానివి కదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేయగా.. సదరు వ్యక్తి పాకిస్థాన్ అభిమానిని'అని చెప్పిన వీడియో వైరల్‌గా మారింది.

4. షమీ %శ% సంజయ్ మంజ్రేకర్

ఐపీఎల్ 2025 మెగా వేలంలో మహమ్మద్ షమీ తక్కువ ధర పలుకు తాడని సంజయ్ మంజ్రేకర్ జోస్యం చెప్పాడు. గతేడాదిగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండటంతో పాటు గాయాలతో సతమతమవుతున్న నేపథ్యంలో అతని కోసం ఫ్రాంచైజీలు ఎక్కువ ఖర్చు చేయలేవన్నాడు.

# 'అశ్విన్‌ను చాలా సార్లు తొక్కేయాలని చూశారు.. కానీ' : మాజీ క్రికెటర్

అశ్విన్ తీవ్ర అసంతృప్తితోనే అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడని ఒకప్పటి అతడి సహచరుడు, సీఎస్కే మాజీ బ్యాటర్ సుబ్రహ్మణ్యం బద్రీనాథ్ ఆరోపించాడు. యాష్ హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడంపై అతడు ఆశ్చర్యపోయాడు. జట్టు మేనేజ్‌మెంట్ నుంచి సరైన వీడ్కోలు లభించలేదని అభిప్రాయపడ్డాడు. "నేను అతడి నిర్ణయానికి షాకయ్యాను. నిజాయతీగా చెప్పాలంటే యాష్‌ను సరిగ్గా ట్రీట్ చేయలేదనే చెప్పాలి. పెర్త్ టెస్టు తర్వాత రిటైర్మెంట్ తీసుకోవాలని అతడు కోరుకున్నట్లు రోహిత్ శర్మ వెల్లడించాడు. వాషింగ్టన్ సుందర్ జట్టులో ఆడుతున్నాడని తెలియగానే అతడు ఆటను వదిలేయాలనుకొన్నాడు. అతడు సంతోషంగా లేడన్న అంశాన్ని ఆ విషయం చెబుతోంది.

నిజంగా చెబుతున్నాను.. ఈ స్థాయికి చేరుకోవడం ఒక తమిళనాడు క్రికెటర్‌కు పెద్ద విషయం. అందుకు చాలా కారణాలున్నాయి. కొన్ని రాష్ట్రాల క్రీడాకారులకే మెరుగైన అవకాశాలొస్తాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అశ్విన్ ఎదురీది 500 వికెట్లు సాధించి లెజెండ్‌గా నిలిచాడు. అతడు ఎటువంటి పరిస్థితులను దాటుకుని వచ్చాడో ఊహించుకోండి. చాలా సందర్భాల్లో అతడిని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. కానీ, ప్రతిసారి ఫినిక్స్ పక్షిలా తిరిగి గాల్లోకి ఎగిరాడు" అని ఓ క్రీడా ఛానల్ వద్ద బద్రీనాథ్ వ్యాఖ్యానించాడు. వాస్తవానికి రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించిన వెంటనే అశ్విన్ జట్టుతో సమయం కూడా గడపలేదు. వెంటనే బ్రిస్బేన్ నుంచి భారత్‌కు బయల్దేరి వచ్చేసిన విషయం తెలిసిందే. క్రికెట్ జీనియస్‌గా పేరుగాంచిన అశ్విన్ భవిష్యత్తులో బీసీసీఐ లేదా ఐసీసీలో కీలక పదవులు చేపట్టేందుకు అర్హత ఉన్న వ్యక్తి అని పాక్ మాజీ ఆటగాడు రషీద్ లతీఫ్ పేర్కొన్నాడు. "భారత్‌లో చాలా మంది క్రికెటర్లు ఉన్నా.. అశ్విన్ స్థాయి ప్రత్యేకమైంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**